Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 | సంచిక : 314 | మేడ్చల్ మల్కాజ్‌గిరి | 3 డిసెంబర్ 2023 | ఆదివారం | పేజీలు : 4

### కాంగ్రెస్‌లో వచ్చే పదేళ్లలో 50 శాతం మహిళా సీఎంలు: రాహుల్

కొచ్చి: కాంగ్రెస్‌లో వచ్చే పదేళ్లలో 50 శాతం మంది మహిళలే ముఖ్యమంత్రులుగా ఉంటారని, కాంగ్రెస్ పార్టీ ఒక టార్గెట్‌గా దీనికి తీసుకుని ముందుకు వెళ్తుందని ఆ పార్టీ సీనియర్ నేత, వయనాడ్ ఎంపీ రాహుల్ గాంధీ తెలిపారు. కేరళ లోని ఎర్నాకుళంలో జరిగిన 'ఉత్సాహ్' మహిళా కాంగ్రెస్ రాష్ట్ర సదస్సులో రాహుల్ గాంధీ మాట్లాడారు. "కాంగ్రెస్ పార్టీ ఒక మంచి టార్గెట్‌తో ఉంది. ఇవాల్టి నుంచి రాబోయే పదేళ్లలో 50 శాతం ముఖ్యమంత్రులుగా మహిళలే ఉంటారు. ఇవాళ ఒక్క మహిళా ముఖ్యమంత్రి కూడా మాకు (కాంగ్రెస్) లేరు. అయితే కాంగ్రెస్ పార్టీలో సీఎం పదవికి అర్హులైన మహిళలు చాలా మంది ఉన్నా రనే విషయం నాకు తెలుసు. పార్టీలో ప్రతి స్థాయిలోనూ మహిళ లకు ప్రాధాన్యం ఇచ్చేలా చూస్తాం" అని రాహుల్ భరోసా ఇచ్చారు.

## ఎగ్జిట్ పోల్ ఫలితాలతో

# కాంగ్రెస్ అలర్ట్



## ఎమ్మెల్యేలతో క్యాంపుకు సిద్ధం

హైదరాబాద్ : ఎగ్జిట్ పోల్ అంచనాల నేపథ్యంలో గెలిచిన ఎమ్మెల్యేలను కాపాడుకోవడంపై కాంగ్రెస్ పార్టీ దృష్టి సారించింది. మెజార్టీ నివేదికలు కాంగ్రెస్‌కు అనుకూలంగా రావడంతో ఆ పార్టీ అధిష్టానం అప్రమత్తైంది. గెలిచిన ఎమ్మెల్యేలను కాపాడుకోవడంపై దృష్టి సారించింది. తెలంగాణ ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే తమ పార్టీ ఎమ్మెల్యేలను మరో ప్రాంతానికి తరలించాలని భావిస్తోంది. గెలిచిన ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించకుండా బెంగుళూరుతో పాటు మరో నగరానికి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయమని టీ పిసిసి అధ్యక్షుడు రేవంత్ రెడ్డి గట్టి ధీమాతో ఉన్నారు. ముందస్తు ఎన్నికల ఫలితాలు ఇచ్చిన ఉత్సాహంతో అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు తమదేననే జోష్‌లో ఉన్నారు. ఆదివారం కౌంటింగ్ ముగిసిన వెంటనే ఎమ్మెల్యేలను ఇతర ప్రాంతాలకు తరలించాలని ఆ పార్టీ పెద్దలు భావిస్తున్నారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేలోపు ఎమ్మెల్యేలు ఇతర పార్టీలకు జంప్ కాకుండా ఉండేందుకు జాగ్రత్తలు తీసుకోనున్నారు. కాంగ్రెస్ పార్టీ 70సీట్లలోపు పరిమితం అయితే ఎమ్మెల్యేలను బెంగుళూరు తరలించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే వరకు కాపాడుకుంటారని ప్రచారం జరుగుతోంది. ఎగ్జిట్ పోల్ ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ విజయావకాశాలు ఎక్కువగా ఉన్నట్లు వెలువడినా ప్రధాన పార్టీల మధ్య గెలిచే అభ్యర్థుల్లో స్వల్ప తేడా మాత్రమే కనిపిస్తంతోంది. తెలంగాణలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే కనీసం 60సీట్లను గెలవాల్సి ఉంటుంది.

కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే అన్ని నియోజక వర్గాలకు ఇద్దరు ఎన్నికల సమన్వయకర్తల్ని పంపింది. ఆదివారం ఆర్వోల నుంచి ధృవీకరణ పత్రాలను అందుకున్న వెంటనే వారిని గుర్తు తెలియని ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేసినట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. అక్కడి నుంచి నేరుగా బెంగుళూరుకు తరలిస్తారని చెబుతున్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో తెలంగాణలో గెలిచిన ఎమ్మెల్యేలు ఆ రాష్ట్రంలో సురక్షితంగా ఉంటారని భావిస్తున్నారు. 2018లో జనతాదళ్, కాంగ్రెస్ కూటమి ఎమ్మెల్యేలను కాపాడుకున్న అనుభవం డికె.శివకుమార్‌కు ఉంది.




### రాహుల్ గాంధీ వ్యాఖ్యల మర్మమేంటి?.. సీఎంగా సీతక్క?

హైదరాబాద్: దేశవ్యాప్తంగా రేపు(ఆదివారం) నాలుగు రాష్ట్రాలకు సంబంధించి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెల్లడవునున్నాయి. ఎన్నికలకు సంబంధించి ఇప్పటికే ఎగ్జిట్‌పోల్స్ ఆసక్తికర వివరాలను వెల్లడించాయి. ఇక, అందరి దృష్టి ముఖ్యంగా తెలంగాణ ఫలితాలపైనే ఉంది. సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ కొడతారా? లేక, కర్ణాటకలో మాదిరిగా కాంగ్రెస్ భారీ మెజార్టీతో గెలుస్తుందా? అనే చర్చ నడుస్తోంది. ఇలాంటి తరుణంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వ్యాఖ్యలు నెట్టింట ఆసక్తికరంగా మారాయి. ఇంతకీ రాహుల్ ఏమన్నాడంటే.. కాగా, కేరళలోని కొచ్చిలో మహిళా కాంగ్రెస్ నేతల సదస్సు 'ఉత్సాహ్'ను రాహుల్ గాంధీ ప్రారంభించారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ సంస్థాగత నిర్మాణంలో మహిళలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, వారిని మరింత ప్రోత్సహించాలని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. పార్టీలో ఇంకా చాలా మంది మహిళా నాయకులను తయారు చేయాలని, దేశంలో వచ్చే పదేళ్లలో 50 శాతం మంది మహిళా ముఖ్యమంత్రులు ఉండాలన్నదే తమ కాంగ్రెస్ లక్ష్యమన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ నుంచి మహిళా ముఖ్యమంత్రి ఎవరూ లేరని అన్నారు. ముఖ్యమంత్రులు కావడానికి అవసరమైన అన్ని అర్హతలు కలిగిన మహిళా నాయకులు కాంగ్రెస్‌లో ఎంతోమంది ఉన్నారని చెప్పారు. ప్రయత్నించాలి, లక్ష్యం సాధించాలి అని సూచించారు. దీంతో ఆయన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి.

## అభ్యర్థులకు తడిసిమోపెడైంది..!

హైదరాబాద్ : అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల ఖర్చు తడిసి మోపైడెంది. ప్రధాన పార్టీల అభ్యర్థుల మధ్య ఈసారి తీవ్ర పోటీ నెలకొంది. దీంతో అభ్యర్థులు సభలు సమావేశాల నిర్వహణకు అధిక మొత్తంలో డబ్బులు వెచ్చించారు. మరోవైపు ఓటర్లను ఆకట్టుకునేందుకు డబ్బుల పంపిణీపాటు గిఫ్టులు, చికెన్, మటన్, మందు వంటి వాటిలో ప్రలోభ పెట్టారు. ఇందుకోసం రూ.కోట్లు వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో కొందరు అభ్యర్థులు ధైర్యంగా ఖర్చు చేయగా, మరికొందరు అప్పులు చేసి మరీ ఖర్చు పెట్టారు. ఇంకొందరైతే ఆ ఖర్చులను తట్టుకోలేక, ఓటర్లకు డబ్బులు ఇచ్చే పరిస్థితి లేక చేతులెత్తాయాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోతున్నారు.

**నామినేషన్ల రోజు నాటి నుంచే..** నామినేషన్ల పర్వం ప్రారంభమైన నాటి నుంచి ఖర్చుల ప్రక్రియ ప్రారంభమైంది. అప్పటి నుంచి అభ్యర్థులంతా ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఏ ఊరికి వెళ్లినా వందలాది మందిని పిలిపించుకున్నారు. ఒక్కోక్కరికి రూ.200 నుంచి రూ.300 చెల్లించారు. గ్రామాల్లో రోజూ ఆయా పార్టీల అభ్యర్థులు కొంత మందిని టీమ్‌గా ఏర్పాటు చేసి ఇల్లిల్లూ తిరుగుతూ తమ పార్టీ అభ్యర్థికే ఓటు వేయాలని స్టిక్కర్లు అంటిస్తూ.. కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు.

**బూత్‌ల వారీగా డబ్బుల పంపిణీ..** ప్రచార ఖర్చులకు తోడు బూత్‌లో ప్రచారం చేసే వారి ఖర్చుల నిమిత్తం రోజుకు ఒక పార్టీ బూత్‌కు రూ.5 వేల చొప్పున ఇవ్వగా, మరో పార్టీ రూ.10 వేలకు పైగా చెల్లించింది. వార్డు లీడర్లకు, ముఖ్యమైన వారికి సాయంత్రమైతే మందు పార్టీల ఖర్చు అదనంగా పెట్టుకోవాల్సి వచ్చిందని ఓ నాయకుడు వివరించారు. ఈ ఖర్చులను కొంత మంది అభ్యర్థులు తట్టుకోలేక నాలుగైదు రోజుల పాటు బూత్‌లలో డబ్బుల పంపిణీ నిలిపివేశారు.




**మందు, విందులు అదనం..** నామినేషన్ల ప్రక్రియ నాటి నుంచే గ్రామాలు, వార్డుల వారీగా కుల సంఘాలు, ఉద్యోగ సంఘాలతో పాటు ఆయా వృత్తి సంఘాలతో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. వారికి మందు, విందు ఏర్పాటు చేశారు. కొందరు రూ.500 చొప్పున అక్కడే పంపిణీ చేశారు.

**పోలింగ్‌కు ముందు డబ్బుల పంపిణీ :** పోలింగ్‌కు ముందు రోజు నుంచి అభ్యర్థులు భారీగా డబ్బులు ఖర్చు చేయాల్సి వచ్చింది. ఒక్కో నియోజకవర్గంలో సగటున లక్ష మందికిపైగా ఓటర్లకు డబ్బులు పంపిణీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొందరు అభ్యర్థులు ఓటుకు రూ.వేయి, రూ.1500 పంపిణీ చేయగా, మరికొందరు రూ.200 నుంచి రూ.800 వరకు ఇచ్చారు. వీటితో పాటు మద్యం ఆఫ్, ఫుల్ బాటిళ్లను కూడా పంపిణీ చేశారు. కొందరు రూ.2 వేల చొప్పున పంపిణీ చేస్తే.. ఇంకొందరు రూ.2,500 పంపిణీ చేసినట్లు తెలిసింది. రెండు మూడు నియోజకవర్గాల్లో అధికార పార్టీ అభ్యర్థులే డబ్బుల్లేక చేతులెత్తేసినట్లు చర్చ జరుగుతోంది. ఓటర్లకు డబ్బులు పంపిణీ చేయని పార్టీల కోసం ఓటర్లు చివరి వరకు ఎదురుచూసి, డబ్బులు ఇచ్చిన వారికి అనుకూలంగా వ్యవహరించినట్లు తెలిసింది.




# ఇక లెక్క తేల్చుడే!

## తెలంగాణ వ్యాప్తంగా 49 కౌంటింగ్ కేంద్రాల్లో భారీ భద్రత

హైదరాబాద్ : తెలంగాణ వ్యాప్తంగా 49 కౌంటింగ్ కేంద్రాల్లో భారీ భద్రత చోటు చేసుకుంది. 119 నియోజకవర్గాల వారిగా కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత, సీసీ కెమెరాలతో పర్యవేక్షణ నిర్వహించనున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలో 29 కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగింది. కౌంటింగ్ కేంద్రాల వద్ద పోలీసుల ఆంక్షలు, 144 సెక్షన్ అమలు చేశారు. కౌంటింగ్ సందర్భంగా రోడ్లపై ర్యాలీలు, టపాసులు కాల్చడం, ఊరేగింపులపై నిషేధం విధించడం జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా రేపు మద్యం దుకాణాలు బంద్ చేశారు. ఉదయం 5గంటలకే కౌంటింగ్ కేంద్రాలకు అధికారులు, సిబ్బంది చేరుకోనున్నారు. లెక్కింపునకు ముందు గంటపాటు ఉద్యోగులకు దిశ నిర్దేశం చేయడం జరిగింది. ఆర్వో ధృవీకరించిన తర్వాత 20 నిమిషాల్లో ఒక్కో రౌండ్ ఫలితం వెలువడనుంది. వేగంగా ఫలితాలు ఇచ్చేందుకు ప్రత్యేక సాఫ్ట్ వేర్ ఏర్పాటు చేయడం జరిగింది.

స్ట్రాంగ్ రూముల వద్ద 40 కేంద్ర కంపెనీల బలగాలతో భద్రత పెంపొందించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2,290 మంది అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. మొత్తం 1766 టేబుల్స్ ఏర్పాటు చేయడం జరిగింది. ఒక్కొక్క నియోజకవర్గానికి 14 టేబుల్స్ ఏర్పాటు చేశారు. 500 పోస్టల్ ఓట్లకు ఒక టేబుల్.. రాష్ట్ర వ్యాప్తంగా 1.80 లక్షల మంది పోస్టల్ ఓటింగ్ చేయడం జరిగింది.

కూకట్‌పల్లి, ఉప్పల్, మల్కాజ్‌గిరి, పఠాన చెరువు, నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాలు 400 పైగా ఉండటంతో ఇక్కడ మాత్రం 20 టేబుల్స్ ఏర్పాటు చేశారు. రాజేంద్రనగర్, ఎల్బీనగర్, శేర్‌లింగంపల్లి, మహేశ్వరం, మేడ్చల్ నియోజకవర్గాల్లో 500 పైగా పోలింగ్ కేంద్రాలుండటంతో 28 టేబుల్స్ ఏర్పాటు చేయడం జరిగింది.రేపు జరుగనున్న కౌంటింగ్ ఏర్పాట్లపై సీపీలు, ఎస్పీలతో డీజీపీ అంజనీ కుమార్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు.

# సంపాదకీయం

## 6 నెలల్లో వెయ్యికి పైగా గుండెపోటు మరణాలు... గుజరాత్ లో ఏమి జరుగుతుంది?

ఇటీవల కాలంలో డ్యాన్స్ చేస్తూనో, ఆటలు ఆడుతూనో ఉన్నపలంగా కుప్పకూలుతున్న వ్యక్తులకు సంబంధించిన సంఘటనలు ఎన్నో వెలుగులోకి వచ్చాయి. అలా కుప్పకూలిన వారిని హుటాహుటిన ఆస్పత్రికి తీసుకుని వెళ్లడం.. అప్పటికే ఆ వ్యక్తి మృతి చెందాడని, గుండెపోటే అందుకు కారణమని డాక్టర్లు చెప్పడం కూడా రొటీన్ అయిపోయింది! ఈ సమయంలో ఇలాంటి మరణాలు గడిచిన ఆరునెలల్లో 1,000 దాటేశాయని గుజరాత్ మంత్రి చెబుతున్నారు. అవును... గుజరాత్ రాష్ట్రంలో గడిచిన ఆరు నెలల కాలంలో గుండెపోటు కారణంగా సుమారు 1,052 మంది ప్రాణాలు కోల్పోయారని ఆ రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. ఇదే షాకింగ్ న్యూస్ అంటే... మరొక షాకింగ్ న్యూస్ కూడా చెప్పింది. అదేమిటంటే... ఇలా గుండెపోటుతో మరణించిన వారిలో 80 శాతం మంది 11–25 ఏళ్ల మధ్య వయసు వారేనట! వాస్తవానికి ఎవరికైనా హఠాత్తుగా గుండెపోటు వస్తే వెంటనే సీపీఆర్ (కార్డియోపల్మోనరీ రిససిటేషన్) చేయాలని చెబుతుంటారు. ఈ ప్రథమ చికిత్స వల్ల ప్రయోజనం చాలా ఉంటుంది! దీంతో... గుండెపోటు ఘటనలు పెరుగుతోన్న నేపథ్యంలో దాదాపు 2 లక్షల మంది టీచర్లు, కాలేజీ ప్రొఫెసర్లకు సీపీఆర్ పై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపింది. తాజాగా ఈ విషయాలపై స్పందించిన గుజరాత్ విద్యాశాఖ మంత్రి కుబేర్ డిండోర్... గుండెపోటుతో ఆరు నెలల్లో 1,052 మంది ప్రాణాలు కోల్పోయారని అన్నారు. వారిలో సుమారు 80 శాతం మంది 11–25 ఏళ్ల మధ్య వయసువారే అనే విషయం తీవ్ర ఆందోళన కలిగిస్తుందని తెలిపారు. పైగా ఈ విద్యార్థులు, యువకులు ఊబకాయులు కూడా కాదని స్పష్టం చేశారు. ఇలా బాధితుల్లో ఎక్కువమంది చిన్నవయసు వారే ఉండటంతో గుండెపోటుపై యువకుల్లో ఆందోళన వ్యక్తమవుతోందని అన్నారు. ఇదే క్రమంలో... గుండె సంబంధిత కారణాలతో రోజుకు సగటున 173 ఎమర్జెన్సీ కాల్స్ సంబంధిత విభాగానికి వస్తున్నాయని వెల్లడించారు. ఇటీవల కాలంలో క్రికెట్ ఆడుతూ.. గార్బా నృత్యం చేస్తూ ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారని విద్యాశాఖ మంత్రి పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో టీచర్లు, కాలేజీ ప్రొఫెసర్లు సీపీఆర్ పై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని మంత్రి తెలిపారు. ఈ సమయంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమంలో ఉపాధ్యాయులందరూ పాలుపంచుకోవాలని ఆయన సూచించారు. ఈ శిక్షణ తీసుకోవడం ప్రమాదంలో ఉన్న వారి ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. ఈ శిక్షణలో 2,500 మంది వైద్య నిపుణులు పాల్గొంటారని మంత్రి వెల్లడించారు.

# ఓట్ల లెక్కింపుకు సర్వం సిద్ధం...

### పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు అయ్యాకే, చివరి రౌండ్ ఓట్ల లేకింపు...

### మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్



గరుడ వార్త మేడ్చల్ జిల్లా బ్యూరో : జిల్లాలో నేడు జరుగనున్న ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో పటిష్ఠ ఏర్పాట్లు చేపట్టామని మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. శనివారం కీసరలోని బోగారం హెూలీమేరి ఇంజనీరింగ్ కాలేజీలో ఐదు నియోజక వర్గాల స్ట్రాంగ్ రూమ్స్ తో పాటు, కౌంటింగ్ హాల్స్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... కౌంటింగ్ రోజున ఐదు నియాజకవర్గాలకి 2439 పోలింగ్ కేంద్రాలు కలిపి మొత్తం 105 రౌండ్స్ ఉండబోతాయని, కౌంటింగ్ కొరకు 116 టేబుల్స్ ఏర్పాటు చేసినట్లుగా తెలిపారు. ఇక ప్రతి టేబుల్ కి మైక్రో అబ్జర్వర్లు, కౌంటింగ్ సూపర్వైజర్ లు, కౌంటింగ్ అసిస్టెంట్లతోపాటుగా, పార్టీ ఏజెంట్లు, రెవెన్యూ సిబ్బంది ఉంటారని తెలిపారు. కౌంటింగ్ రోజున సి సి కెమెరా నిఘాతో పాటుగా పటిష్ఠ భద్రత కల్పిస్తున్నామని తెలిపారు. (43)మేడ్చల్ నియోజకవర్గానికి గాను 584 పోలింగ్ కేంద్రాలు ఉండటంతో 21 రౌండ్స్, కౌంటింగ్ టేబుల్స్28, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ టేబుల్స్–04, (44)మల్కాజ్ గిరి నియోజకవర్గానికి గాను 429 పోలింగ్ కేంద్రాలు, 21 రౌండ్స్, కౌంటింగ్ టేబుల్స్ 20, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ టేబుల్స్–02 (45)కుతుబులాపూర్ నియోజకవర్గానికి గాను 590 పోలింగ్ కేంద్రాలు, 21 రౌండ్స్, కౌంటింగ్ టేబుల్స్ 28, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ టేబుల్స్–02, (46)కూకట్ పల్లి 418,పోలింగ్ కేంద్రాలు, 21రౌండ్స్, కౌంటింగ్ టేబుల్స్ 20. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ టేబుల్స్–01, (47)ఉప్పల్ ,418, పోలింగ్ కేంద్రాలు,21 రౌండ్స్ కౌంటింగ్ టేబుల్స్, 20, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ టేబుల్స్–02, ఈసారి పోస్టల్ బ్యాలెట్లకు ప్రత్యేకంగా టేబుళ్లు ఏర్పాటు చేస్తున్నట్లుగా తెలిపారు. ఈవీఎంల కౌంటింగ్ పూర్తయ్యేలోపు పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు పూర్తిచేయాలని నిర్ణయించారు. ఒకవేళ ఈవీఎంల ఓట్ల లెక్కింపు పూర్తయ్యేలోగా పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు పూర్తికపోతే, చివరి రౌండ్ ఈవీఎంల లెక్కింపును నిలిపేసి పోస్టల్ బ్యాలెట్లను లెక్కిస్తారు. ఆ తర్వాతే చివరి రౌండ్ ఈవీఎంల లెక్కింపు చేపట్టాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఈసారి ఐదు నియోజకవర్గాలకుగాను దాదాపు 9889, పోస్టల్ బ్యాలెట్లు వినియోగించారని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్, తెలిపినారు.

# పారదర్శకంగా ఓట్ల లెక్కింపు కొరకు ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వార కౌంటింగ్ సిబ్బంది ఎంపిక

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్.




గరుడ వార్త మేడ్చల్ జిల్లా బ్యూరో : మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు సంబంధించి ఎన్నికల నిబంధనల అనుసరిస్తూ కౌంటింగ్ సిబ్బందిని ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వార ఎంపిక చేపట్టారు. ఈ మేరకు శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశమందిరములో జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎస్.కె.జైన్, అమన్ మిట్టల్ ,కౌంటింగ్ ప్రత్యక అబ్జర్వర్లు, కి హిమన్షు వర్మ, దశరథ్ దెబ్బర్మ, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ ఆధ్వర్యంలో ఎన్నికల కౌంటింగ్ సిబంది ర్యాండమైజేషన్ ప్రక్రియను చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ జిల్లాలోని ఐదు శాసనసభ నియోజక వర్గాలకు సంబంధించి మొత్తం 2439 పోలింగ్ కేంద్రాలకు గాను 508 మంది కౌంటింగ్ సిబ్బందిని ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వారా ఎంపిక చేయడం జరిగిందని పేర్కొన్నారు. అందులో 161 మంది కౌంటింగ్ పర్యవేక్షకు లు, కౌంటింగ్ అసిస్టెంట్స్, 177 మంది, మైక్రో అబ్జర్వర్ల 170 మంది ఉన్నారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు విజయేందర్ రెడ్డి, అభిషేక్ అగస్త్య, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులతో పాటు రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యాన విద్యకు బాటలు..!

మానుకోట: గత 36 ఏళ్లుగా తెలంగాణలో ప్రధాన ఉద్యాన పరిశోధనా స్థానంగా ప్రసిద్ధి పొందిన మల్యాలలోని జన్నారెడ్డి వెంకటరెడ్డి ఉద్యాన పరిశోధనా కేంద్రం (జేవీఆర్ హెచ్‌ఆర్‌ఎస్) ఇక నూతన ప్రస్థానానికి శ్రీకారం చుట్టనుంది. ఈ పరిశోధనా స్థానంలో ఉద్యాన డిగ్రీ కళాశాలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ విద్యాసంవత్సరంలోనే ప్రవేశాలను నిర్వహించే ఆలోచనలో ఉన్నట్లు భావిస్తున్నారు. ఇప్పటివరకు ఉద్యాన పంటల పరిశోధనతో అన్నదాతలకు వ్యవసాయ సేవలను అందించిన ఈ పరిశోధనా స్థానం ఇకపై ఉద్యాన విద్యను అందించడంలో విద్యార్థులకు వరం కానుంది.

**పంటలపై పరిశోధనలు**

మల్యాల గ్రామానికి చెందిన ఉమ్మడి రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి జన్నారెడ్డి రఘోత్తంరెడ్డి తన 160 ఎకరాల వ్యవసాయ భూమిని ఇక్కడ ఉద్యాన పరిశోధనా కేంద్ర ఏర్పాటుకు విరాళంగా ఇచ్చారు. 1989లో ఇది ప్రారంభంకాగా 1991లో కేవీకేను కూడా నెలకొల్పారు. ఇక విశాలమైన తోటలతో 110 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న జేవీఆర్ హెచ్‌ఆర్‌ఎస్‌లో మిరప, పాప్రికా, ఉల్లి, పసుపు, టమాట, మామిడి, సపోటా, జామ, కరోండా తదితర పంటలపై ఇక్కడి శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తున్నారు. రైతులకు నాణ్యమైన, అధిక దిగుబడులను ఇచ్చే ఆయా పంటల రకాలను పరిచయం చేసి, వాటిని సాగు చేసి ఆదాయాన్ని పొందేలా ప్రోత్సహిస్తున్నారు. నశించి పోతున్న మామిడి చెట్లను పునరుద్ధరించే ప్రక్రియను చేపట్టి విజయవంతంగా నిర్వహిస్తుండడం ఓ విశేషం. ఈ ప్రాంతానికి ఏ రకం పనస సాగుకు అనువుగా ఉంటుందో పరిశోధన చేస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎంతో చరిత్ర కలిగిన చపాటా మిర్చి రకానికి భౌగోళిక గుర్తింపు తీసుకువచ్చేందుకు ఈ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు కృషి చేస్తున్నారు. ఎంఐడీహెచ్ కార్యక్రమం ద్వారా కొత్తిమీర, వెల్లుల్లి, మెంతుల విత్తనాల ఉత్పత్తిని చేపట్టారు.

**60 మందికి అవకాశం**

శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయానికి (ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ) అనుబంధంగా డిగ్రీ స్థాయిలో ఇక్కడ ఏర్పాటు కానున్న ఉద్యాన కళాశాల వల్ల భవిష్యత్తులో ఏటా కనీసం 60 మందికి బీఎస్సీ (ఆనర్స్) హార్టికల్చర్ నాలుగేళ్ల కోర్సులో గ్రాడ్యుయేషన్ విద్యను అభ్యసించే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల వారికి ఇది వరంగా మారనుంది.

**నిర్వహణకు రూ.166 కోట్లు నిధుల అంచనా..**

నూతన ఉద్యాన కళాశాల ఏర్పాటు చేస్తే ఐదేళ్ల పాటు దాని నిర్వహణకు రూ.166.07 కోట్లు అవసరమని ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ అధికారులు బడ్జెట్ అంచనా వేశారు. బోధన, బోధనేతర సిబ్బంది, ప్రయోగశాలల ఏర్పాటుకు నిధులు అవసరమవుతాయి. కళాశాలకు 58 మంది బోధనా సిబ్బందిలో ప్రొఫెసర్లు 8 మంది, అసోసియేటెడ్ ప్రొఫెసర్లు 16, అసిస్టెంట్ ప్రొఫెసర్లు 33, అసిస్టెంట్ లైబ్రెరియన్ ఒకరు అవసరం.వివిధ కేటగిరీల్లో బోధనేతర సిబ్బంది 177 మంది అవసరమవుతారని అంచనా వేశారు.

**ఈ విద్యా సంవత్సరంలోనే..?**

మల్యాలలో ఉద్యాన కళాశాలను ఈ విద్యా సంవత్సరంలోనే (2023–24)లోనే ప్రారంభిస్తారని అనుకుంటున్నారు. బీఎస్సీ (ఆనర్స్) హార్టికల్చర్‌లో ప్రవేశాలు ఈ సంవత్సరం నిర్వహించిన టీఎస్‌ఎంసెట్–2023 ద్వారానే జరుగుతాయి. ఈ విద్యాసంవత్సర ప్రవేశాల కౌన్సిలింగ్ ప్రకియ పూర్తి కాలేదని అందువల్ల ప్రవేశాలు కోరేవారు ఆప్షన్ పెట్టుకోడానికి రాష్ట్రంలోని ఉద్యాన కళాశాలల జాబితాలో ఈ నూతన కళాశాలను కూడా చేర్చాల్సి ఉంటుందని భావిస్తున్నారు. ఈ విద్యాసంవత్సనరంలోనే ప్రవేశాలు నిర్వహిస్తే శాశ్వత భవనం ఏర్పాటు చేసేవరకు తాత్కాలికంగా జిల్లా కేంద్రంలోనే అద్దె భవనాన్ని తీసుకోవచ్చని అంచనా వేస్తున్నారు.

# అందుబాటులో నిధులు.. నత్తనడకన పనులు

పెద్దపల్లి : నియోజకవర్గ స్థాయి అభివృద్ధి నిధుల(సీడీపీ) వినియోగంలో జిల్లా ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ సంవత్సరం ఫిబ్రవరి నుంచి నిధులు విడుదలవుతూ వస్తున్నా ఖర్చు చేయడంలో పూర్తి స్థాయిలో వెనుకబడ్డారని ప్రభుత్వ నివేదికలే స్పష్టం చేస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ అభివృద్ధి పనులు శరవేగంగా చేపట్టాల్సి ఉంటుంది. ఎన్నికల కోడ్ అమలులోకి వస్తే కొత్తగా పనులు ప్రారంభించే అవకాశం ఉండదు. అప్పటికే మొదలైన పనులపై కూడా యంత్రాంగం పర్యవేక్షణ కరవవుతుంది. అందుబాటులో నిధులున్నా అభివృద్ధి పనులకు పూర్తి స్థాయిలో వినియోగించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నియోజకవర్గ స్థాయిలో శాసనసభ్యులు ప్రత్యేక అభివృద్ధి నిధులు(ఎస్డీఎఫ్), ఉపాధిహామీ, డీఎంఎఫ్‌టీ నిధులతో మాత్రమే పనులు చేస్తున్నారే తప్ప తమకు సొంతంగా ఖర్చు చేసుకునేందుకు వీలున్న సీడీపీ నిధులపై దృష్టి సారించడం లేదు. ఎక్కువగా కమ్యూనిటీ గదులు, సీసీ రహదారులు, ఇతరత్రా చిన్నపాటి పనులను ప్రారంభించి వదిలేస్తున్నారు. ఇటు టెండర్లు పిలవడంలో జాప్యం, అటు ఎన్నికల గడువు సమీపిస్తుండటంతో వీటి నిర్మాణ ప్రక్రియ సాధ్యమవుతుందా? లేదా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు తమకు కేటాయించిన నిధులను ప్రజాప్రయోగ పనులకు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు.

**రూ.కోట్లలో నిధులు.. రూ.లక్షలోనే వ్యయం**

జిల్లాలోని 3 నియోజకవర్గాలుండగా ఒక్కో ఎమ్మెల్యేకు, ఒక ఎమ్మెల్సీకి



కలిపి ఏడాదికి రూ.5 కోట్లు చొప్పున రూ.20 కోట్లు కేటాయించారు. ఒక్కో ప్రజాప్రతినిధికి కేటాయించిన నిధుల నుంచి రూ.2 కోట్ల మేర 'మన ఊరు–మన బడి' కార్యక్రమానికి అందించారు. మిగిలిన రూ.3 కోట్లలో రూ.1,50,000 చొప్పున హరితనిధికి కేటాయించగా ఒక్కొక్కరికి దాదాపు రూ.2.98 కోట్లు మిగిలాయి. మొత్తం ముగ్గురు ఎమ్మెల్యేలు, ఒక ఎమ్మెల్సీ కలిపి రూ.11,94,00,000 కోట్లు వచ్చాయి. ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావుకు మొత్తం 60 పనులకు రూ.4.97 కోట్లు రాగా 5 పనులకు రూ.49.49 లక్షలు మాత్రమే ఖర్చు చేశారు. ఇంకా 53 పనులు కొనసాగుతుండగా రూ.4.37 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఇంకా 2 పనులకు రూ.7.8 లక్షల విలువైన పనులు చేయాల్సి ఉంది. ఎమ్మెల్సీ కోటా కింద అదనంగా పెద్దపల్లి జిల్లాకు మాత్రమే 33 పనులకు గాను రూ.3.49 కోట్లు కేటాయించారు. ఇందులో రూ.29.98 లక్షల విలువైన 3 పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం జరుగుతున్న 28 పనులకు రూ.3.09 కోట్లు ఖర్చు చేశారు. ఇంకా రూ.7.83 లక్షల విలువైన 2 పనులు కొనసాగుతున్నాయి.

రామగుండం ఎమ్మెల్యే చందర్‌కు మొత్తం 40 పనులకు రూ.2.49 కోట్లు రాగా ఇందులో 7 పనులకు రూ.6.84 లక్షలు మాత్రమే ఖర్చు చేశారు. ఇంకా 33 పనులు జరుగుతుండగా రూ.2.48 కోట్లు వెచ్చించనున్నారు. ప్రస్తుతం ఎలాంటి పనులు జరగడం లేదు.

పెద్దపల్లి శాసనసభ్యుడు మనోహర్‌రెడ్డికి మొత్తం 61 పనులకు రూ.2.31 కోట్లు రాగా ఇందులో 12 పనులకు రూ.41.77 లక్షలు మాత్రమే ఖర్చు చేశారు. మరో 45 పనులు కొనసాగుతుండగా ఇందుకు రూ.1.72 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఇంకా 4 పనులకు రూ.12.78 లక్షల విలువైన పనులు చేయాల్సి ఉంది.

మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబుకు మొత్తం 55 పనులకు రూ.2.49 కోట్లు రాగా ఇందులో 2 పనులకు రూ.13.27 లక్షలు మాత్రమే వెచ్చించారు. 51 పనులు కొనసాగుతుండగా రూ.2.29 కోట్లు ఖర్చు చేయనున్నారు. ఇంకా 2 పనులకు రూ.4.79 లక్షల విలువైన పనులు జరగాల్సి ఉంది.

# వ్యాధుల కాలం... అప్రమత్తతతోనే ఆరోగ్యం భద్రం

సిరిసిల్ల : ఎడతెరిపి లేని వర్షాలు, దిగజారుతున్న పారిశుద్ధ్యం, దోమల వ్యాప్తి కారణంగా పలు ప్రాంతాల్లో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు బాధితుల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. డెంగీ కేసులు నమోదవడం ఆందోళన కలిగిస్తోంది. పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడంతో పాటు దోమల నివారణకు పురపాలక సంఘాలు, పంచాయతీ పాలక వర్గాలు చర్యలు చేపట్టాల్సిన తరుణం ఇదే. ఖాళీ స్థలాల్లో దట్టంగా పెరిగే పిచ్చి మొక్కలు, చెట్ల పొదలు, పేరుకుపోయిన చెత్తాచెదారం, మురుగు తరలింపు, ఫాగింగ్ తదితర చర్యలు కొనసాగించాల్సిన అవసరం ఉంది.జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు సిరిసిల్ల, వేములవాడ పురపాలక సంఘాల పరిధితో పాటు గ్రామీణ ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వరద ఇళ్ల పరిసర ప్రాంతాల్లో చేరి నిల్వ ఉండటంతో నీటిపై దోమలు చేరి వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుంది. గ్రామాల్లో పంచాయతీ కార్మికులు ఇప్పటికే సమ్మెలో ఉన్నారు. పారిశుద్ధ్య పనుల విషయంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ప్రధానంగా సిరిసిల్ల పట్టణంలోని విలీన గ్రామాలతోపాటు శ్రీనగర్ కాలనీ, శాంతినగర్, గణేష్‌నగర్, సంజీవయ్యనగర్, పద్మనగర్, అశోక్‌నగర్, అంబికానగర్ తదితర ప్రాంతాల్లో మురుగు ప్రవహించే నాలాలు లేక వర్షం వస్తే వరద ఎక్కడికక్కడ నిలిచిపోయే అవకాశం ఉంది. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పట్టణంలోని అన్ని వార్డుల్లో ఖాళీగా ఉన్న స్థలాల్లో పిచ్చి మొక్కలు, చెట్ల పొదలు లేకుండా, నీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకుంటే వ్యాధుల నియంత్రణకు అవకాశం ఉంటుంది. అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టాలని పలువురు కాలనీవాసులు పేర్కొంటున్నారు.జిల్లాలో గడిచిన అయిదేళ్లుగా ప్రధానంగా డెంగీ కేసులు ఎక్కువగా నమోదు కావడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తోంది. వర్షాకాలంలో టైఫాయిడ్, గన్యా, డెంగీ వంటి విష జ్వరాలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంది. మరోవైపు వ్యాధులను నివారించేందుకు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో జ్వర సర్వేలు చేపడుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రతి శుక్ర, మంగళవారాల్లో డ్రై డే తప్పకుండా ప్రతి ఇంటా పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

**కార్మికుల సమ్మెతో పేరుకుపోయిన చెత్తాచెదారం**

ముస్తాబాద్: గ్రామ పంచాయతీ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసంసమ్మెబాట పట్టారు. ఇరవై ఏడు రోజులుగా సమ్మె చేస్తుండటంతో గ్రామాల్లో ఎక్కడికక్కడ చెత్తాచెదారం పేరుకుపోయింది. కాల్వలో వ్యర్థాలు చేరి మురుగు ముందుకు కదలడం లేదు. ముస్తాబాద్‌లో గ్రామ పంచాయతీ కార్యాలయం మొదలుకొని నూతన బస్టాండ్ వరకు ప్రధాన రోడ్డుపై ప్రతి ఆదివారం వార సంత నిర్వహిస్తుంటారు.

## ఆన్‌లైన్ మోసాలకు అడ్డుకట్టేద్దాం!

అచ్చంపేట : ఆన్‌లైన్ మోసాల బారిన పడకుండా పోలీసులు అవగాహన కల్పిస్తున్నా.. ఉపయోగం లేకుండా పోతోంది. డిజిటల్ లావాదేవీలు పెరిగి పోవడంతో అదే స్థాయిలో మోసాలు కూడా అధికమవుతున్నాయి. పండుగ సందడి మొదలవడంతో ఆన్‌లైన్ కొనుగోళ్లు మరింత పెరిగాయి. కొన్ని ఉత్పత్తులపై 50 శాతం నుంచి 90 శాతం వరకు తగ్గింపు.. ఒకటి కొంటే మరొకటి ఉచితం.. ఛార్జీలు లేకుండా ఉచిత రవాణా అంటూ ప్రకటనలు ఊరిస్తున్నాయి. కొన్ని కంపెనీలు నిజమైన రాయితీలు ఇస్తుండగా మరికొన్ని బోగస్ ప్రకటనలతో బురిడీ కొట్టిస్తున్న సంఘటనలు ఎన్నో వెలుగు చూస్తున్నాయి. మాల్స్, షోరూముల్లో కనిపించని వస్తువులు ఆన్‌లైన్ షాపింగ్‌లో దర్శనమిస్తున్నాయి. ఆన్‌లైన్ షాపింగ్ ప్రకటనలను గుడ్డిగా నమ్మితే మోసపోవడం మీవంతవుతుంది. ప్రచారంలో చెప్పిన వస్తువు ఆర్డర్ చేయగానే ఇంటికి వేరేది వస్తోంది. ధరల్లో కూడా వ్యత్యాసం ఉండటంతో ఎవరిని సంప్రదించాలో తెలియక ఇబ్బందుల్లో పడుతున్నారు. ఆన్‌లైన్ షాపింగ్‌లో ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ ఉత్పత్తులతో పాటు ఫర్నీచర్, రెడీమేడ్స్, మహిళల యాక్సెసరీస్, కాస్మోటిక్స్, స్మార్ట్‌ఫోన్లు తదితర రకాల ఉత్పత్తులు దర్శనమిస్తుంటాయి. ఆర్డర్ చేసిన కొద్ది రోజుల్లోనే ఆయా కంపెనీలు వాటిని నేరుగా ఇంటికే పంపిస్తున్నాయి. చూడటానికి, వినడానికి ఈ విధానం బాగున్నా కొన్ని సందర్భాల్లో వినియోగదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఆర్డర్ చేసిన వస్తువులు రాగానే వాటిని చూసి విస్తుపోతున్న సంఘటనలు ఎన్నో వెలుగు చూస్తున్నాయి.

ఇంటి నుంచే ఫిర్యాదు.. ఆన్‌లైన్ మోసాల బారిన పడినవారు పోలీసుస్టేషన్‌కు వెళ్లకుండా ఇంటి నుంచే అంతర్జాలంలోనే ఫిర్యాదు చేసే వెసులుబాటు ఉంది. నేరుగా ఫిర్యాదు చేసేందుకు ఆసక్తి చూపని వారికి చక్కని అవకాశం ఉంది. ఆన్‌లైన్ మోసాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు భారత ప్రభుత్వం ఆన్‌లైన్ సైబర్ క్రైం ఫిర్యాదు పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ పోర్టల్‌ను ఉపయోగించి బాధితులు ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయడానికే పరిమితం కాకుండా దానికి సంబంధించిన దర్యాప్తు ఎంత వరకు వచ్చిందనే అంశాన్ని కూడా తెలుసుకోవచ్చు. ఆన్‌లైన్ ఫిర్యాదు చేసేందుకు సీవైబీఈఆర్‌సీఆర్ఐఎంఈ.జీవోవీ.ఐఎన్ అనే వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఫిర్యాదు చేయొచ్చు. ఘటనకు సంబంధించిన కీలక వివరాలన్నీ నమోదు చేయాల్సి ఉంటుంది. ఫిర్యాదు దారు సోషల్ మీడియా ఖాతా వివరాలు, వెబ్‌సైట్ యూఆర్ఎల్‌ను నమోదు చేసి ఆపై నేరానికి సంబంధించిన సాక్ష్యాలను అప్‌డేట్ చేయాలి. ఫిర్యాదు ప్రతిని పీడీఎఫ్ విధానంలో భద్రపరచుకోవచ్చు. దాన్ని ప్రింట్ కూడా తీసుకోవడానికి అవకాశం ఉంది.

ఓటీపీ నంబరు చెప్పడంతో..

అచ్చంపేటకు చెందిన ఒకరు వైద్య పరీక్షల కోసం హైదరాబాద్‌లోని ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ ఉన్న సమయంలో అతనికి అపరిచితుడు ఫోన్‌చేశారు. కాల్ సెంటర్ నుంచి ఫోన్ చేస్తున్నామని చరవాణిని అప్‌డేట్ చేసుకోకపోతే సేవలు నిలిచిపోతాయని నమ్మించాడు. ఓటీపీ చెప్పాలని కోరడంతో ఆస్పత్రిలో ఉన్న ఆ వ్యక్తి హడావుడిలో ఆలోచన చేయకుండా చెప్పేశాడు. వెంటనే అతని బ్యాంకు ఖాతాలోని రూ. 99 వేలు మాయమయ్యాయి. సంక్షిప్త సమాచారం చూసుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

లాటరీ వచ్చిందని..

అచ్చంపేటలోని ఓ కాలనీకి చెందిన మహిళకు గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి ఓ కంపెనీ నిర్వహించిన లాటరీలో రూ. 25 లక్షలు బహుమతి వచ్చిందని నమ్మించాడు. బహుమతిని పొందడానికి వివిధ ఫీజుల కోసం రూ. 1.50 లక్షలు పంపింది. మరోసారి కొంత నగదు చెల్లించాలని ఫోన్ రావడంతో మోసపోయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

## గ్రీన్‌ఫీల్డ్‌తో డొంక రోడ్లు కనుమరుగు

ఖమ్మం : చింతకాని మండలం కొదుమూరు–వందనం మధ్య దశాబ్దాలుగా రెవెన్యూ రికార్డుల్లో ఉన్న డొంక రహదారికి అడ్డంగా గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి వెళ్తోంది. ఇక్కడ ఎలాంటి అండర్‌పాస్‌లు, అప్రోచ్ రోడ్లు ఏర్పాటు చేయటం లేదు. దీంతో ఆయా గ్రామాలకు చెందిన 450 మందికి పైగా రైతులు తమ భూముల్లో సాగు చేయడమెలా అంటూ తలలు పట్టుకున్నారు. అల్లీపురం నుంచి రామకృష్ణాపురం వరకూ వెళ్లేందుకు గోళ్లపాడు డొంక దశాబ్ద కాలంగా రెవెన్యూ రికార్డుల్లో ఉంది. దీని గుండా ఖమ్మం నగర సమీపంలోని అల్లీపురం, రామకృష్ణాపురం, అనంతసాగర్, ధంసలాపురం, కొత్తగూడెం, బస్వాపురం రైతులు కొన్ని దశాబ్దాలుగా వెళ్తూ పంటలు పడిస్తున్నారు. గ్రీన్‌ఫీల్డ్ రహదారి వల్ల ఈ డొంక కనుమరుగయ్యే దుస్థితి నెలకొంది. దీంతో వెయ్యి మందికి పైగా రైతులకు ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయి. ఎన్‌హెచ్ అధికారులు కేవలం రైతులు నడిచి వెళ్లేందుకు వీలుగా దిగువ భాగంలో చిన్న కాలినడక లో–లెవల్ వంతెన ఏర్పాటు చేసే మాస్టర్‌ప్లాన్ రూపొందించారు. దీన్ని రైతులు అడ్డుకున్నారు. పెనుబల్లి మండలం కొండ్రుపాడు రెవెన్యూలో వ్యవసాయ భూముల గూండా వెళ్లే డొంక రహదారి ప్రదేశంలో చిన్న లోలెవల్ వంతెన(అండర్‌పాస్) ఏర్పాటు చేసేందుకు ఎన్‌హెచ్ అధికారులు నిర్ణయించారు. వేంసూరు మండలం భీమవరం–లింగపాలెం గ్రామాల మధ్య అనుసంధాన రహదారి వద్ద తీరు. కొద్ది ఎత్తులో.. తక్కువ వెడల్పుతో వంతెన ఏర్పాటు వల్ల కనీసం పంటలు నూర్చేందుకు హార్వెస్టర్లు, ట్రాక్టర్లు కూడా వెళ్లలేని పరిస్థితి ఏర్పడనుంది.

పొలాలకు వెళ్లేదెలా అని రైతుల ఆందోళన

సూర్యాపేట–దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి నిర్మాణ పనులు ఖమ్మం జిల్లా వ్యాప్తంగా వేగంగా సాగుతున్నాయి. ఈ రహదారి జిల్లాలో ఖమ్మం గ్రామీణ మండలం పొన్నేకల్లు నుంచి ప్రారంభమై సత్తుపల్లి మండలం తుమ్మూరు వరకూ వెళ్లి ఆ తరువాత ఏపీలోకి ప్రవేశిస్తుంది. జిల్లాలో 92 కిలోమీటర్ల నిడివిలో నిర్మిస్తున్న జాతీయ రహదారి పలు రెవెన్యూ గ్రామాల నుంచి వెళుతోంది. అడ్డంగా గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు వెళుతుండటంతో డొంక రోడ్లు రెండు భాగాలుగా విడిపోనున్నాయి. దీంతో వందలాది మంది రైతులు పొలాలకు వెళ్లే సౌలభ్యం లేక అవస్థలు పడాల్సిన దుస్థితి నెలకొంది. అక్కడ లో లెవల్ వంతెన(అండర్‌పాస్)ల ను కూడా ఏర్పాటు చేయకపోవటంతో రైతులు పనులను అడ్డుకోవటంతో పాటు ఆందోళనలు సైతం చేపడుతున్నారు. ప్రతి డొంక రోడ్డు వద్ద లో లెవల్ వంతెన నిర్మించాలని అధికారులకు వినతి పత్రాలు ఇస్తున్నారు.

జిల్లాలో 1,656 ఎకరాల సేకరణ

గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి కోసం ప్రభుత్వం ఒక కిలోమీటరుకు 18 ఎకరాల భూమి చొప్పున సేకరించింది. ఖమ్మం జిల్లాలో ఇలా 92 కి.మీ. నిడివిలో 1,656 ఎకరాలు భూమిని సేకరించాల్సి వచ్చింది. ఈ నిడివిలో చింతకాని, కొణిజర్ల, వైరా, సత్తుపల్లి, కల్లూరు, వేంసూరు, ఖమ్మం గ్రామీణ మండలాల్లో దశాబ్దాలుగా రెవెన్యూ రికార్డుల్లో ఉన్న పలు డొంకదారులు తమ ఉనికి కోల్పోయే పరిస్థితి నెలకొంది.

తలెత్తే నష్టాలు దశాబ్దాలుగా రెవెన్యూ రికార్డుల్లో ఉన్న డొంక రహదారులకు అడ్డంగా జాతీయ రహదారి వెళ్లడంతో రెండు వైపులా ఉన్న తమ పంట భూములకు రైతులు, ప్రజలు చేరలేని పరిస్థితి. ఎన్‌హెచ్ రహదారికి ఇరువైపులా హద్దుగా ఆరు అడుగుల ఎత్తులో కాంక్రీట్ గోడ ఏర్పాటు చేయనుండటంతో కనీసం కాలినడకన సైతం రోడ్డు దాటలేరు. కంటి కన్పిస్తున్న పొలాల వద్దకైనా కిలోమీటర్లు తిరిగి రావాల్సి ఉంటుంది. ఇక పంట ఉత్పత్తులు తరలించడం, ఇతర పనులకు ట్రాక్టర్లు, హార్వెస్టర్లు రావాలంటే ఎంతో వ్యయప్రయాసలు ఏర్పడతాయి. ఇలా చేస్తే మేలుడొంక రోడ్ల ప్రాంతంలో గ్రీన్‌ఫీల్డ్ రహదారి ఎత్తు పెంచాలి. అక్కడ ట్రాక్టర్లు, హార్వెస్టర్లు వెళ్లే ఎత్తులో లోలెవల్ వంతెన నిర్మించాలి. డొంక రోడ్ల ప్రాంతంలో హార్వెస్టర్లు, ట్రాక్టర్లు వెళ్లే విధంగా లో లెవల్ వంతెనలు ఏర్పాటు చేయాలి. లేకపోతే వందలాది ఎకరాల్లో సాగు ప్రశ్నార్థకంగా మారే ప్రమాదముంది. దీనిపై ఆందోళనలు తీవ్రతరం చేస్తాం.

## వడ్లరాసులపై వెంకన్న శయనించినట్టు!



మహబూబ్‌నగర్ : జిల్లా మన్యంకొండ వేంకటేశ్వరస్వామి తెలంగాణలోనే సుప్రసిద్ధ ఆలయం. పేదల తిరుపతిగా ప్రసిద్ధి. మహబూబ్‌నగర్–రాయచూర్ మార్గంలో మన్యంకొండ ఆలయ ముఖ ద్వారం ఉంటుంది. ఆ ద్వారం గుండా ఘాట్‌రోడ్‌లో ఏడు కొండలు ఎక్కితే కానీ స్వామి వారి దర్శన భాగ్యం కలుగదు. ప్రస్తుతం భక్తులు ఆ స్వామివారిని దర్శించుకోవాలంటే కొండలను మాత్రమే కాదు.. దారిపొడవునా వరి కుప్పలు, వడ్ల రాసులను దాటుకుంటూ వెళ్లాలి. ఒక్కమాటలో చెప్పాలంటే ఆ ఎంకన్న స్వామి ఇక్కడ ఏడు కొండలపై శయనించారా? లేక వడ్లరాసులపై శయనిస్తున్నారా? అనిపిస్తుందంటే అతిశయోక్తి కాదు.ఒకనాడు పాలమూరు జిల్లా కరువు కాటకాలకు నిలయం. బుక్కెడు బువ్వ, గుక్కెడు నీళ్ల కోసం అలమటించిన నేల. ఆకలి చావులకు, అంబలి కేంద్రాలకు నెలవు. బతుకుదెరువు భారమై తట్టా,బుట్టా నెత్తిన బెట్టుకొని పిల్లా, జెల్లలను వెంటబెట్టుకొని జిల్లా దాటి, రాష్ట్రం ఎల్లలు దాటి వలసలు వెళ్లడం సర్వసాధారణం. తెలంగాణ రాష్ట్రం వస్తే ఏమొస్తదని ఉద్యమ సమయంలో ప్రశ్నించిన వారు ఒకసారి మారిన పాలమూరు జిల్లా రూపురేఖలను చూపిస్తే చాలు.. అదే సమాధానం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక రాష్ట్రాన్ని సాధించిన ఉద్యమనేత కేసీఆరే ముఖ్యమంత్రి ఆయ్యాక ఆయన ఏలుబడిలో తెలంగాణ జీవన దృశ్యం సమూలంగా మారిపోయింది. కరువు తాండవించిన చోట ఎక్కడ చూసినా పచ్చని పంట పొలాలు, గలగలపారే కాలువలు, నిండుకుండలా జలవనరులు, దారి పొడవునా కిలో మీటర్లమేర ఆరబోసిన ధాన్యపు రాసులు దర్శనం ఇస్తున్నాయి. తెలంగాణకు వ్యవసాయమే ప్రధాన జీవనోపాధి అయినప్పటికీ సమైక్యపాలకుల వివక్షకు గురైంది. నీటిపారుదల వనరులు లేక వ్యవసాయరంగం కుదేలయ్యింది. వర్షాధార, గొట్టపు బావులపై ఆధారపడిన సేద్యం గాలిలో దీపం మాదిరిగా సాగేది. వర్షాలు పడి, గొట్టపు బావుల్లో నీళ్లున్నా కరెంట్ ఉండేది కాదు. చేతికొచ్చిన పంట చేలు బీటలువారేవి. పెట్టుబడి కోసం చేసిన అప్పు ముప్పై తీర్చలేక రైతులు ఆత్మహత్యలు చేసుకొనేవారు. కానీ.. నేడు సీఎం కేసీఆర్ నేతృత్వంలోని పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నంబర్‌గా ఎదిగింది. తలసరి ఆదాయం, విద్యుత్తు వినియోగంలో మొదటి స్థానంలో నిలిచింది.

రెండు పర్యాయాల బీఆర్ఎస్ పాలనలో ఎన్నో కొత్త సాగునీటి ప్రాజెక్టులు నిర్మించారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తయ్యాయి. మిషన్ కాకతీయ పథకంతో చెరువులు జలకళను సంతరించుకొన్నాయి. భూగర్భ జలాలు పైకి తన్నుకువచ్చాయి. ఎక్కడ చూసినా పుష్కలంగా నీళ్లు.. ఎకరానికి పది వేల రూపాయల చొప్పున రైతుబంధు.. వ్యవసాయానికి ఉచితంగా 24 గంటల కరెంట్.. దీంతో పుష్కలంగా పంటలు పండుతున్నాయి. కరువు తీరింది. వలసలు ఆగిపోయాయి. ఇప్పుడు పక్క రాష్ట్రాల నుంచి వచ్చే కూలీలకు పని కల్పించే స్థాయికి చేరుకొన్నాం. అయితే ప్రజాస్వామ్య ప్రక్రియలో ఐదేండ్లకోసారి ప్రజలు తమ ప్రభుత్వాన్ని ఎన్నుకోక తప్పదు. ఈ ఎన్నికల్లో తెలంగాణను దక్షిణాది ధాన్య బాండాగారంగా తీర్చిదిద్దిన కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వానికి మళ్లీ పట్టం కట్టేందుకు క్షేత్రస్థాయిలో ప్రజలు ఒక తాటిమీదికి వచ్చారు. తిరిగి కేసీఆర్ సర్కారే రావాలని పంతం పట్టారు. మార్పు కాదు.. మళ్లీ కేసీఆర్ సర్కారే రావాలని మనసు నిండా కోరుకుంటున్నారు. మళ్లీ కేసీఆరే హ్యాట్రిక్ సీఎం అని చెప్పేందుకు పాలమూరు జిల్లా ప్రజల మనోగతం ఒక్కటిచాలు.

కేసీఆర్ రాక మునుపు నీళ్లెక్కడియి? వడ్లెక్కడియి?

కేసీఆర్ రాక మునుపు నీళ్లెక్కడియి?.. వడ్లెక్కడియి?.. కేసీఆర్ వొచ్చినంకనే తెలంగాణలో పసిడి పంటలు పండుతున్నయి. కరువుల పాలమూరు కామధేనువు అయ్యింది. ఇట్లా మా బతుకులు బాగుచేసినోళ్లను, అన్నీ ఇచ్చేటోళ్లను ఎందుకు వదులుకుంటం? కృష్ణయ్య, రైతు

ఏ గాలి లేదు

టీడీపీ, కాంగ్రెస్ జమానాలో మమ్మల్ని (దివ్యాంగులను) ఎవరూ పట్టించుకునేవారు కాదు. కేసీఆర్ వచ్చినంక మొదట 3 వేలు ఇచ్చిండు. ఇప్పుడది 4 వేలు జేసిండు. మా ఊళ్లో అందరికి చెప్పి ఏపిస్త. ఇక్కడ ఏ గాలి లేదు.. అందరం కేసీఆర్ వెంటే ఉంటం. –నాగన్న, దివ్యాంగుడు, గోప్లాపూర్, దేవరకద్ర

చాలినంత కరెంట్ ఉంది.. ఇంకేంగావాలి?

కేసీఆర్ వచ్చినంక చాలినంత కరెంట్ ఇస్తుండు. ఇంకేదీ అవసరం లేదు. మా ఊళ్లో అందరు మంచిగ బతుకుతుండ్రు. ముసలోళ్లకు పింఛన్ ఇస్తున్నరు. రైతులకు పైసలిస్తున్నరు. పంటలు బాగా పండుతున్నయి. ఇంతకంటే ఇంకేమిగావాలె. అందుకే కేసీఆర్ వెంటే నడుస్తం. జినగరాళ్ల వరలక్ష్మి, కిరణంషాప్, గోప్లాపూర్, దేవరకద్ర

## తేడా వస్తే భూముల ధరలు 50 ఏండ్లు ఎన్కకే!

మహబూబ్‌నగర్ : ఎట్లుండే తెలంగాణ.. ఎట్లయ్యింది నేడు? రాష్ట్రం ఏర్పడకముందు భూముల విలువ ఎట్లుండే? బీడు, పడావుపడ్డ భూములను ఎవరన్నా పట్టించుకున్నరా? వేలు, లక్ష లోపే ధరలుండేవి. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చినంక ఎంతో మార్పు. ఇప్పుడు పడావు, బీడు భూములు ఎక్కడన్నా కనపడుతున్నాయా? అసలు భూముల ధరల్లో ఎంత తేడా వచ్చింది. పదేండ్లలో ఇరవై రెట్లకు పైగా భూముల విలువ పెరగలేదా? ఆపత్కాలంలో మనల్ని ఆదుకుంటుందనే ధీమా భూమి యజమానుల్లో పెరగలేదా?

అందుకు ప్రధాన కారణం.. దండగ అనుకున్న సాగును పండుగలా మార్చేందుకు కేసీఆర్ చేపట్టిన పథకాలే. 24 గంటల కరెంటు, పుష్కలంగా సాగు నీరు, రైతు బంధు, రైతుబీమా.. ఇలా ఎన్నో చర్యలతో బీళ్లుగా ఉన్న భూములన్నీ సాగులోకి వచ్చాయి. భూముల విలువ పెరిగింది. దానితోపాటు ప్రజల్లో భరోసా పెరిగింది. ప్రజలు గుండెలపై చేతులేసుకుని నిశ్చింతగా నిద్రపోతున్న వేళ.. మళ్లీ మేమున్నామని కాంగ్రెస్ వాళ్లు వచ్చిన్రు. ఒక్క అవకాశమంటూ మభ్యపెడుతున్నరు. ఆదమరిచి వారికి ఓటు గనుక వేస్తే మన భూముల విలువంతా ఢాం అని పేలిపోతది. తస్మాత్ జాగ్రత్త.

ఊరుచివర మారుమూల ఉన్న ఎకరా భూమి కూడా ఇప్పుడు రూ.50 లక్షల ధర పలుకుతుంది కదా! రేపు, అదే భూమి రూ.50 వేల విలువ కూడా చేయకపోతే? ఏం జేస్తరు?? ఏంది గట్ల మాట్లాడుతరు అంటున్రా?? ‘ఒక్క చాన్స్’ అంటూ ఉరికొస్తున్న కాంగ్రెస్ వాళ్లను నమ్మి ఓటేస్తే.. అదే జరుగుతది. మన భూముల విలువ ఢామ్మని పేలిపోతది. కాంగ్రెస్ పాలనలో మన భూముల విలువేందో ఓ సారి యాది జేస్కోండి! మీకే సమజైతది.


అంతేకాదు, ఎవుసానికి మూడు గంటల కరెంట్ చాలన్న రేవంత్.. ఇప్పుడు రియల్ ఎస్టేట్ తన పేటెంట్, తాను రియల్ ఎస్టేట్ వ్యాపారినని బాహాటంగానే ప్రకటించాడు.

అలాంటి కాంగ్రెస్‌కు ఆదమరిచి ఓటేశామా?? మన భూముల విలువ పడిపోతది. ఉన్న ఆ కొద్దిభూములు కూడా రాబందుల పాలైతయ్.

వస్తువైనా, మరేదైనా.. డిమాండ్ ఉన్నప్పుడు సైప్లై తగ్గిపోతే.. దాని ధర/విలువ పెరుగుతుంది. ఇది ఆర్థిక శాస్త్రంలో ఒక సూత్రం. ఇదే సూత్రం భూములకు కూడా వర్తిస్తుంది. భూమి ఎన్నటికైనా పెరగదు. ఎంతున్నదో అంతే ఉంటుంది. కానీ జనాభా మాత్రం ఏటికేడు పెరుగుతూనే ఉన్నది. ప్రజల కొనుగోలు శక్తి, భూములను ఉపయోగించే క్రమాన్ని అనుసరిస్తూ.. ఈ భూముల ధరలు పెరుగుతూ ఉంటాయి.

రాష్ట్రం ఏర్పడకముందు రూ. లక్షలోపే

తెలంగాణ ఏర్పడక ముందు భూముల విలువ చాలా తక్కువగా ఉండేది. రూ. లక్షకు అటూ ఇటూగా ఎకరం భూమి దొరికేది. ఇక ఆదిలాబాద్ లాంటి జిల్లాల్లోనైతే రూ.వేలల్లోనే భూమి లభించేది. రాష్ట్రం ఏర్పడకముందు.. బీడు భూములు, పడావు పడ్డ భూములే అధికంగా ఉండేవి. వ్యవసాయం చాలా తక్కువ విస్తీర్ణంలో జరిగేది. వానకాలం, యాసంగి కలిపి కేవలం 1.20 కోట్ల ఎకరాల్లోనే అరకొర వ్యవసాయం సాగేది. వ్యవసాయానికి సరిపోయినంత విద్యుత్తు ఇవ్వకుండా.. 7 గంటల విద్యుత్తు అని చెబుతూ.. నాలుగైదు విడతల్లో ముక్కుతూ, మూలుగుతూ విద్యుత్తు సరఫరా చేసేవారు. పైగా రైతులకు ఎలాంటి పెట్టుబడి సాయం ఉండేది కాదు. అప్పులు తీసుకుని



పంటలను సాగు చేసేవారు. ఇటు విద్యుత్తు లేక.. అటు సాగునీరు అందక.. పంటల దిగుబడిరాక.. అప్పులు పెరిగి ఆత్మహత్యలు చేసుకున్న రైతన్నల దీనగాథలు ఎన్నెన్నో ఉన్నాయి. దీనితో రైతన్నలు వలస వెళ్లి కూలి పనులు చేసుకునేవారు. రాష్ట్రంలో మొత్తం బీడు భూములే కనపడేవి. పాలమూరు వలసల జిల్లాగా అందుకే పేరుగాంచింది. ఇలాంటి దయనీయమైన పరిస్థితులు నెలకొన్నందునే.. అప్పట్లో వ్యవసాయ భూముల ధరలు చాలా తక్కువగా ఉండేవి.

సొంత రాష్ట్రంలో పండుగలా వ్యవసాయం

తెలంగాణ రాష్ట్రం ఏర్పడగానే.. అభివృద్ధికి మొదటి అడుగు వేసింది విద్యుత్తు విషయంలోనే. ముందుగా వ్యవసాయానికి 9 గంటల విద్యుత్తును పునరుద్ధరించారు. అటు తరువాత.. విద్యుత్తు వ్యవస్థలను బలోపేతం చేసి.. 2018 జనవరి ఒకటి నుంచి సాగుకు 24 గంటలు నిరంతరాయంగా పూర్తి ఉచిత విద్యుత్తును ఇస్తున్నారు. జలవనరులను పునరుద్ధరించారు. కాళేశ్వరం, పాలమూరు–రంగారెడ్డి, సీతారామ లాంటి భారీ ప్రాజెక్టులను నిర్మించి రాష్ట్రవ్యాప్తంగా సాగునీటికి ఢోకా లేని పరిస్థితిని సృష్టించారు. అది వానకాలం అయినా.. యాసంగి అయినా.. పంటలకు పుష్కలంగా సాగునీరు అందుబాటులోకి రావడంతో.. బీడు భూములన్నీ సాగవ్వడం మొదలయ్యింది. వలస వెళ్లిన యజమానులు, రైతు కూలీలు తమ సొంతూళ్లకు తరలి వచ్చారు. రైతు సంక్షేమ పథకాలతో వ్యవసాయం బాగుపడటంతో ఇప్పుడు ఏకంగా బీహార్, మహారాష్ట్ర, ఒడిశా, యూపీ, మధ్యప్రదేశ్ లాంటి రాష్ట్రాల నుంచి కూలీలు వచ్చి ఇక్కడ పనిచేస్తున్నారంటే పరిస్థితుల్లో ఎలాంటి మార్పులు వచ్చాయో అర్థం చేసుకోవచ్చు.

పదేండ్లలో ఇరవై రెట్లు పెరిగిన భూముల ధరలు

సొంత రాష్ట్రం ఏర్పడకముందు ఉన్న దయనీయ పరిస్థితులన్నీ ప్రత్యేక రాష్ట్రంలో మారిపోయాయి. భూములకు డిమాండ్ పెరిగింది. కొనేవారు ఎక్కువయ్యారు. భూములను అమ్మేవారు తగ్గిపోయారు. డిమాండ్.. సైప్లైల మధ్య తేడా తీవ్రమయ్యింది. దీంతో భూముల విలువ పెరిగింది. ఏదన్నా అత్యవసరం అయితే, కుటుంబ అవసరాలకు ఉన్నదాంట్లో ఎంతో కొంత భూమి అమ్మడం తప్పితే.. ఉన్న భూమంతా అమ్ముకోవడం అనేది లేదిప్పుడు. అందుకే భూముల విలువ మరింతగా పెరిగింది. గడిచిన పదేండ్లలో భూముల ధరలు సగటున ఇరవై రెట్లు పెరిగాయనే చెప్పవచ్చు. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, నల్లగొండ, రంగారెడ్డిలాంటి నగరాలు, పట్టణాల్లో భూముల ధరలు అనూహ్యంగా పెరిగాయి. కంపెనీలు, పెట్టుబడులు వెల్లువలరావడంతో రియల్‌ఎస్టేట్ గణనీయంగా పుంజుకున్నది.

## అదనపు వసూళ్లు.. వినియోగదారుల జేబులకు చిల్లు

ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌లో ఇటీవల ఓ ఇంటి వద్ద వినియోగదారుడికి సిలిండర్ అప్పగించి బిల్లును చేతికందించారు. బాయ్స్ రసీదులో నమోదైన రుసుం కంటే రూ. 60 అదనంగా తీసుకున్నారు. ఇతను ఒక్కడి వద్దే కాదు. వినియోగదారులందరి వద్ద దూరాన్ని బట్టి ఇలా ఎక్కువగా వసూలు చేస్తున్నారు. జిల్లాలో వంట గ్యాస్ ఏజెన్సీల బాయ్స్ అదనపు వసూళ్లకు తెగబడుతుండటంతో వినియోగదారుల జేబులకు చిల్లు పడుతోంది. వాయుబండకు రూ. 30 నుంచి రూ. 60 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. గ్యాస్ ఏజెన్సీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. గ్యాస్ సిలిండర్ ధరను ఇటీవల కేంద్ర ప్రభుత్వం తగ్గించడంతో వినియోగదారులు కొంతమేర ఊరట పొందగా అదనపు వసూళ్లు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి. దీంతో వంట గ్యాస్ వినియోగదారులపై అదనపు భారం పడుతుండగా ఏజెన్సీల బాయ్స్‌కు రూ.లక్షల్లో గిట్టుబాటవుతుందనే విమర్శలు సర్వత్రా వెల్లువెత్తుతున్నాయి.

జిల్లాలో రెండు పురపాలక సంఘాలు, 12 మండలాల్లో మొత్తం 1,49,245 మంది గ్యాస్ వినియోగదారులు ఉన్నారు. వీరిలో సింగిల్ కనెక్షన్లు 55,860 ఉండగా, డబుల్ కనెక్షన్లు 34,474 ఉన్నాయి. దీపం పథకం కింద 25,033, కార్పొరేట్ సామాజిక బాధ్యత పథకం పరిధిలో 14,452, ఉజ్వల పథకం కింద 19,426 కనెక్షన్లు ఉన్నాయి. వినియోగదారుల్లో అత్యధిక శాతం మంది పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారే ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 12 ఏజెన్సీల ద్వారా గ్యాస్ సిలిండర్లు సరఫరా అవుతున్నాయి. సిలిండర్లను సరఫరా



చేసే వాహనాలు, డెలివరీ బాయ్స్ నిర్వహణ బాధ్యత ఏజెన్సీలదే. గ్యాస్ సిలిండర్ల పంపిణీలో కొన్ని ఏజెన్సీల బాయ్స్ తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. డెలివరీ బాయ్స్ ఒక్కో సిలిండర్ వెంట రూ. 30 నుంచి రూ. 60 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలో ఓ ఏజెన్సీకి చెందిన సిలిండర్ ధర రూ. 973.50 ఉండగా డెలివరీ బాయ్స్ రూ. వెయ్యి నుంచి రూ. 1030 వరకు తీసుకుంటున్నారు. రవాణా ఛార్జీల పేరిట కొనసాగుతున్న ఈ అదనపు వసూళ్ల మొత్తం ప్రతి నెలా రూ.లక్షల్లో ఉంటుంది. నిబంధనల ప్రకారం రసీదులో ఉన్న మొత్తాన్ని మాత్రమే గ్యాస్ ఏజెన్సీలు వినియోగదారుల వద్ద తీసుకోవాలి. రవాణా ఛార్జీల పేరిట ఎలాంటి అదనపు వసూళ్లకు పాల్పడకూడదనే నిబంధనలను జిల్లాలోని పలు ఏజెన్సీల బాయ్స్ విస్మరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అదనపు వసూళ్లకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

బిల్లు ప్రకారమే చెల్లించాలి

వినియోగదారులు వారికి వచ్చే బిల్లు ప్రకారమే గ్యాస్ సిలిండర్‌కు డబ్బులు చెల్లించాలి. గ్యాస్ ఏజెన్సీల బాయ్స్ వినియోగదారుల వద్ద బలవంతంగా అదనంగా డబ్బులు వసూలు చేయవద్దనే నిబంధనలు ఉన్నాయి. నిబంధనలను అతిక్రమించే గ్యాస్ ఏజెన్సీలపై చర్యలు ఉంటాయి. అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమకు ఫిర్యాదు చేస్తే వెంటనే స్పందిస్తాం. విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. జితేందర్‌రెడ్డి, పౌరసరఫరాలశాఖ జిల్లా అధికారి

## పారిశ్రామిక ప్రాంతం.. వసతులు గగనం

ఎల్లారెడ్డిపేట :పారిశ్రామిక ప్రాంతంలో మెరుగైన సదుపాయాలు లేక వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఎన్టీపీసీలోని అంబేద్కర్ కూడలి నుంచి ఆర్.ఎఫ్.సి.ఎల్. వరకు గల ప్రధాన రహదారిలో వీధి దీపాలు, విభాగినులు(డివైడర్లు) లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రామగుండంలో ఎరువుల కర్మాగారం ఏర్పాటుకు ప్రోత్సాహాన్నిచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం రహదారి నిర్మాణం కోసం సుమారు రూ.3 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో ఎన్టీపీసీ నుంచి ఆర్.ఎఫ్.సి.ఎల్. వరకు రోడ్డు నిర్మించాల్సి ఉండగా ఫెర్టిలైజర్ సిటీలోని ఆర్.ఎఫ్.సి.ఎల్. ప్రధాన రహదారులతో పాటు ఆర్.ఎఫ్.సి.ఎల్. రైల్వేలైను నుంచి ప్రగతినగర్ వరకు రోడ్డు నిర్మాణం చేపట్టారు. టౌన్‌షిప్‌లో కేంద్రీకృత విద్యుత్తు దీపాలను ఏర్పాటు చేయగా రైల్వే ట్రాక్ గౌతమినగర్ నుంచి ప్రగతినగర్ వరకు కేవలం విభాగినులు నిర్మించి మొక్కలు నాటారు. కేంద్రీకృత విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయలేదు. దీంతో ఆయా ప్రాంతాల్లో అంధకారం నెలకొంది.ప్రధాని వస్తున్నారని... రెండేళ్లక్రితం రామగుండం ఎరువుల కర్మాగారాన్ని ప్రారంభించేందుకు ప్రధాని వస్తున్నారని సుమారు రూ.2.62 కోట్లతో ప్రగతినగర్ నుంచి ఎన్టీపీసీ టౌన్‌షిప్ రింగు రోడ్డు వరకు రహదారి నిర్మించారు. నగరంలోని ఐదు డివిజన్లలో అభివృద్ధి పనుల కోసం కేటాయించిన నిధులను ఇందుకోసం కేటాయించారు. తర్వాత ఈ రోడ్డుకోసం కేటాయించిన డబ్బులను ఆర్.ఎఫ్.సి.ఎల్. నుంచి తీసుకుంటామని నగరపాలక అధికారులు పేర్కొన్నప్పటికీ ఇప్పటి వరకూ చెల్లింపులు జరగలేదు. ఈ రోడ్డులో డివైడర్లు, విద్యుత్తు దీపాలు లేకపోవడంతో రాత్రి వేళల్లో వాహనదా రులు ప్రమాదాలకు గురవుతున్నారు. వీధిదీపాలు లేకపోవడంతో ప్రగతినగర్‌లోని డివైడర్‌ను ఢీకొని ఒకరు మృతి చెందగా అనేకసార్లు జరిగిన ప్రమాదాల్లో పలువురు తీవ్రగాయాల పాలయ్యారు. ఎన్టీపీసీ నుంచి ప్రగతినగర్ వరకు డివైడర్లు లేవు. వేగంగా వచ్చే వాహనదారులు ప్రగతినగర్ నుంచి ఉన్న డివైడర్లను గమనించకుండా ఢీకొట్టి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రోడ్డు ద్వారానే రామగుండం ఎరువుల కర్మాగారం యూరియాను తరలిస్తుంటారు. గతంలోఉన్న విద్యుత్తు దీపాలను రహదారి విస్తరణ పేరిట తొలగించిన అధికారులు మళ్లీ ఏర్పాటు చేయలేదు. ఈ నేపథ్యంలో ఎరువుల కర్మాగారం యాజమాన్యం ప్రత్యేక శ్రద్ధ వహించి డివైడర్లు, విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. నగరపాలకవర్గం దృష్టి సారించి ఇబ్బందుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# అన్నదాతల కష్టం వరదపాలు

ఖమ్మం : అధిక వర్షాలు, వరదలతో అన్నదాతలకు కడగండ్లే మిగులుతున్నాయి. ఏటా ముంచెత్తుతున్న భారీ వరదలతో గోదావరి పరివాహక ప్రాంతంలో సాగు మనుగడే ప్రశ్నార్థకమవుతోంది. ఇంటిల్లిపాది రెక్కలు ముక్కలు చేసుకుని పండిస్తున్న పంటలను వర్షాలు, వరదలు ముంచెత్తుతున్నాయని, ఆదుకోండి మహాప్రభో.. అంటూ నెత్తినోరూ బాదుకుంటున్నా పాలకులు పట్టించుకోవట్లేదని రైతులు వాపోతున్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో పంటల సాగుపై ప్రకృతి పగబట్టినట్టుంది. గతేడాది వానాకాలంలో భారీ వర్షాలు, వరదల నుంచి వరుసగా మూడో సీజన్‌లోనూ అన్నదాతలు నష్టాలను మూటగట్టుకుంటున్నారు. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా గతేడాది గోదావరి ఉప్పొంగటం, వరదలు ముంచెత్తటం, ఆతర్వాత యాసంగి సీజన్ (మార్చి, ఏప్రిల్)లో భారీ వర్షాలు కురవటంతో పంటలు దెబ్బతిన్నాయి. ఖమ్మం జిల్లాలో 18,500 మంది రైతులు 23వేల ఎకరాల్లో పంటలు నష్టపోయారు. భద్రాద్రి జిల్లాలో సుమారు 3వేల మంది రైతులకు చెందిన 8వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. తాజాగా వారం పాటు ముంచెత్తిన వానలు రైతులకు భారీ నష్టాలే మిగిల్చాయి. ఖమ్మం జిల్లాలో 4వేల ఎకరాలు, భద్రాద్రి జిల్లాలో 2వేల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు తేల్చారు.

పంటల సాగు ప్రశ్నార్థకం

గోదావరి పరివాహకంలోని భద్రాచలం, చర్ల, దుమ్ముగూడెం, బూర్గంపాడు, అశ్వాపురం, మణుగూరు, పినపాక, కరకగూడెం మండలాల్లో పంటల సాగు నానాటికీ దయనీయంగా మారుతోంది. రైతుల కష్టమంతా వరదపాలవుతోంది. గతేడాది 128 గ్రామాల్లో



పత్తి, వరి, మొక్కజొన్న పంటలు తుడిచిపెట్టుకుపోయాయి. 6,765 మంది రైతులకు చెందిన 17,637 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. రూ.20కోట్ల మేర పెట్టుబడులు నష్టపోయారు. వరదల ధాటికి పంటపొలాల్లో 2-4 అడుగుల మేర ఇసుక మేటలు వేయడం వల్ల అన్నదాతలకు అదనపు భారం తప్పడం లేదు.

ప్రతిపాదనలకే పరిమితం

రైతులకు పంట నష్టపరిహారం ఏళ్లుగా అందని ద్రాక్షగానే మిగిలింది. ఏటా ఉభయ జిల్లాల్లో వర్షాలు, వరదల ధాటికి పంటలు దెబ్బతినటం, అధికారులు వివరాలు సేకరించటం పరిపాటిగా మారింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఆశించిన స్థాయిలో పరిహారం అందటం లేదు. మార్చి, ఏప్రిల్‌లో భారీ వర్షాలకు నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఎకరాకు రూ.10వేల చొప్పున పరిహారం ప్రకటించింది. కొంతమేర రైతులకు మేలు జరిగింది. గోదావరి వరదల్లో పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం ఊసే లేకుండా పోయింది.

గతేడాది వానాకాలం పదెకరాల్లో వరి, 20 ఎకరాల్లో పత్తి సాగుచేశాను. పత్తి పంటకు ఎకరాకు రూ.15వేలు, వరికి ఎకరాకు రూ.10వేల పెట్టుబడి పెట్టాను. అప్పట్లో వచ్చిన వరదల ధాటికి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. సుమారు రూ.4లక్షల నష్టం వాటిల్లింది. ఈసారీ పంటలను వరదలు ముంచెత్తాయి. అధికారులు వివరాలు సేకరిస్తున్నా ఇప్పటివరకు పైసా పరిహారం అందలేదు.

వీరారెడ్డి, సంజీవరెడ్డిపాలెం, బూర్గంపాడు మండలంచంద్రలబోడులో గోదావరి ఒడ్డున మూడెకరాల భూమి ఉంది. ప్రస్తుత సీజన్‌లో మూడెకరాల్లో పత్తి సాగుకు రూ.50వేలు వెచ్చించాను. గోదావరి ఉప్పొంగడంతో వరదలు ముంచెత్తి పంట కొట్టుకుపోయింది. ఏటా ఇదే పరిస్థితి ఎదురవుతోంది. గతంలో అధికారులు వచ్చి పంట నష్టం వివరాలు సేకరించినా పరిహారం అందించలేదు. ఈసారి అధికారులు రానేలేదు. కారం రామారావు, చంద్రలబోడు, అశ్వాపురం మండలం

# కూరగాయల సాగు తగ్గుతోంది!

వరంగల్ : జనగామ జిల్లాలో ఏటేటా కూరగాయలు పండించే రైతుల సంఖ్య తగ్గుతోంది. అధిక శ్రమ ఉండటం, కోతుల బెడద కారణంగా కూరగాయల పంటలపై ఆసక్తి చూపడం లేదు. ఓ వైపు సాగు తగ్గడం మరో వైపు ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కూరగాయల సాగుకు ప్రభుత్వం ఎలాంటి ప్రోత్సహకాలు ఇవ్వడం లేదు. నాలుగేళ్ల క్రితం జిల్లాలో 4వేల ఎకరాల్లో కూరగాయల పంటలు పండితే ప్రస్తుతం వెయ్యి ఎకరాలకు తగ్గింది. సాగు తగ్గడంతో ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

మంచి దిగుబడి, అధిక గిట్టుబాటు ధర, శ్రమ తక్కువ ఉన్న పంటల వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. అధికంగా వరి, పత్తి పంటకు అధిక ప్రాధాన్యతనిస్తుండగా ఆ తర్వాతి స్థానంలో మిర్చి పంట వేస్తున్నారు. ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగుకు అధిక ప్రోత్సాహం అందిస్తుండటంతో ఆ పంట వైపు రైతులు ఆసక్తి పెంచుకుంటున్నారు. శ్రమపడాల్సిన కూరగాయల సాగు తగ్గుముఖం పట్టింది. అధిక విస్తీర్ణంలో కూరగాయల సాగు చేసే రైతులు అరకొరగా మిగిలారు.

అవగాహన కల్పిస్తున్నాం..- కెఆర్.లత జిల్లా ఉద్యానవన శాఖాధికారి

కూరగాయల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. సాగుకు ఆసక్తి కనపరిచే రైతులకు ఎకరానికి రూ.18 వేల విలువ గల టమాట, మిర్చి, వంకాయ నారును ప్రభుత్వం అందించే రాయితీతో రూ.1200 నుంచి 1500 లకు అందిస్తున్నాం. డీడీ తీసిన రైతులకు 20 రోజుల్లో నారు లభించేలా చర్యలు చేపట్టాం. తక్కువ శ్రమతో గిట్టుబాటు ధర లభిస్తున్న వరి వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. రైతులతో పాటు పల్లెల్లో పెరటి కూరగాయల సాగు, మిద్దె తోటలకు ఆసక్తి కనపరిచే రైతులకు ప్రోత్సాహం అందిస్తున్నాం.

ప్రోత్సాహం అసరం- ప్రశాంత్, రామన్నగూడెం

కూరగాయల సాగుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహం అందించాలి. సాగుకు భూమి సిద్ధం చేయడం మొదలు అధిక ధర విత్తనాలు, చీడపీడల బెడదల నివారణకు అధిక ఖర్చు, నిత్యం కోతులు, పక్షుల నుంచి పంటను రక్షించుకొనేందుకు అధిక శ్రమ పడాల్సి వస్తోంది. వాతావరణం సైతం అనుకూలించడం లేదు. పంటను సరైన ధరకు అమ్ముకొనేందుకు ప్రత్యేక మార్కెట్ లేదు.

# అడవి బిడ్డల విన్నపాలు వినవలె..



కొత్తగూడెం :రాష్ట్రంలోనే పెద్ద ఐటీడీఏగా గుర్తింపు పొందిన భద్రాచలం మన్యం పాలనపై పీఓ ప్రతీక్‌జైన్ క్రమంగా దృష్టి సారిస్తున్నారు. వరుస సమావేశాలను ఏర్పాటు చేస్తున్నారు. క్షేత్రస్థాయి సమాచారం తెలుసుకుంటున్నారు. ఇదే ఉత్సాహంతో పనిచేస్తే ఏజెన్సీలో నెలకొన్న సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని అడవి బిడ్డలు ఆశిస్తున్నారు. నాలుగు జిల్లాల పరిధిలో 32 మండలాల్లో మన్యం విస్తరించింది. దీనికి మహర్దశ రావాలంటే ప్రతి సోమవారం జరిగే దర్బారులో పీఓ అందుబాటులో ఉండాలి. వినతుల ప్రగతిపై నివేదికలను రూపొందించాలి. మూడేళ్ల ముందు దస్త్రాలకు ఇ-ఫైలింగ్ ఉండేది. శాఖల వారీగా వచ్చిన దరఖాస్తులను కంప్యూటర్‌లో నిక్షిప్తపరచటం వల్ల ప్రతి విషయం పీఓకు తెలిసేది. కొంతకాలంగా ఈ ప్రక్రియ ఆగిపోయింది. దీన్ని పునరుద్ధరిస్తే పారదర్శకత వస్తుంది. ప్రధాన విభాగాల్లో యూనిట్ అధికారుల పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది.

విద్య, వైద్యం కీలకం

మన్యం విద్యలో డీడీ, ఆర్సీఓ విభాగాలు కీలకం. డీడీ పరిధిలో గిరిజన ప్రాథమిక, ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాలు ఉండగా వీటిలో 25వేల మంది బాలబాలికలు చదువుతున్నారు.

కొన్ని వసతిగృహాలను ఆశ్రమ పాఠశాలలుగా మార్చి సరిపడా ఉపాధ్యాయ పోస్టులను మంజూరు చేయలేదు. ఎక్కువచోట్ల సీఆర్టీలపైనే ఆధారపడ్డారు. ఇటీవల డీడీగా బాధ్యతలు చేపట్టిన మణెమ్మకు దిశానిర్దేశం అవసరం.

ఇంటర్, డిగ్రీ కళాశాలలు మంజూరుచేయాలి. ప్రి ఎగ్జామినేషన్ ట్రైనింగ్ సెంటర్ బలోపేతమవ్వాలి. ప్రభుత్వ కొలువులకు ఎంపికయ్యేందుకు అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వాలి.

బీఈడీ, డీఎడ్ కళాశాలలకు పూర్తిస్థాయి ప్రిన్సిపల్స్‌ను నియమించాలి.

వైటీసీ ద్వారా ప్రైవేట్ రంగంలో ఉపాధి కల్పించాలి. ఎంప్లాయిమెంట్ ఉప కార్యాలయం సేవలను బలోపేతం చేయాలి.

ఆర్సీఓ పరిధిలోని ఒకటి నుంచి డిగ్రీ వరకు గురుకులాలు, ఏకలవ్య మోడల్ పాఠశాలలు, ప్రతిభా విద్యాలయాల్లో 14వేల మంది చదువుతున్నారు. పూర్తిస్థాయి ఆర్సీఓను నియమించాలి. భవనాల కొరతను తీర్చాలి. మెనూ ఛార్జీలను ప్రభుత్వం పెంచినందున నాణ్యమైన ఆహారమందించాలి.

అదనపు డీఎంహెచ్ఓ ఎవరన్నది గందరగోళంగా మారింది. దీన్ని గుర్తించి సమస్యను పరిష్కరించాలి. ఏరియా ఆసుపత్రిలో నిపుణుల కొరత తలెత్తవద్దు. మలేరియా, డెంగీ వ్యాధులు ప్రబలకుండా దోమ తెరలు అందించాలి.

ఐటీడీఏ షాపింగ్ కాంప్లెక్స్‌లో బినామీలకు అవకాశం లేకుండా చూడాలి. వీలైనంత తొందరగా పాలక మండలి సమీక్ష జరపాలి.

గిరిజనులు ఆశిస్తున్నవి

ట్రైకార్‌లోని పలు పథకాలు గిరిజనానికి ప్రయోజనం కలిగిస్తున్నాయి. ఒక్కోసారి బడ్జెట్ లేక యూనిట్లను అధికారులు ఆలస్యంగా అందిస్తున్నారు. త్రీఫేజ్ విద్యుత్తు సదుపాయం, సాగునీరు, అటవీహక్కుల చట్టం, ఎల్టీఆర్ చట్టం, కొండరెడ్ల సంక్షేమంపై దృష్టి సారించాలని గిరిజనులు కోరుతున్నారు.

పోషకాహారమే ప్రధాన సమస్యగా మారినందున అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలి. రుతు రుమాళ్లు, సబ్బులు, పోషకాహారం తయారీ వంటి చిన్న, సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమలను విస్తరించాలి.

వి-హబ్ ద్వారా యువ పారిశ్రామికవేత్తలకు అవకాశాలు కల్పించాలి.

అభివృద్ధి పనుల్లో కీలకమైన ఇంజినీర్ విభాగంపై దృష్టి సారించాలి.

చేపట్టిన పనులు సకాలంలో పూర్తవ్వాలి.

# కోక.. సరికొత్త కానుక..!



కొత్తగూడెం : మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం చీరలను పంపిణీ చేయనుంది. సరికొత్త ఆలోచనతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. చీరలను శ్రీసత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ అందిస్తోంది. ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న కార్మికులకు ప్రేమపూర్వక చిరుకానుక అందించాలని సర్కారు సంకల్పించింది. ఇప్పటికే బతుకమ్మ పండగ పురస్కరించుకొని ఏటా ఆడపడుచులకు చీరలను ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. అదే తరహాలో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అందించే మహిళా కార్మికులకు చీరలు అందించనుంది. జిల్లా విద్యాశాఖ కార్యాలయ గోదాములకు చీరలను సరఫరా చేసింది. మొత్తం 17 రంగులు, 240 డిజైన్లు, ఆరున్నర మీటర్ల పొడవుతో చీరలు ఉండనున్నాయి. మధ్యాహ్న భోజన కార్మికులుగా పనిచేస్తున్న పురుషులకు త్వరలో చొక్కాలు, దోతీలను ప్రభుత్వం అందజేయనుంది. వంట నిర్వహణ సమయంలో కార్మికులు ధరించేందుకు యాప్రాన్లు ఇవ్వనుంది.

ఇదీ పరిస్థితి..ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో వంట చేసే మహిళలకు చీరలు అందనున్నాయి. ఖమ్మం జిల్లాలో 1,264 పాఠశాలల్లో 2,240 మంది, భద్రాద్రి జిల్లాలో 1,375 పాఠశాలల్లో 2,097 మంది వంట ఏజెన్సీ కార్మికులుగా పనిచేస్తున్నారు. వారం రోజుల్లో ఎంఈఓ కార్యాలయాల నుంచి కాంప్లెక్స్ పరిధిలో సీఆర్పీల ద్వారా పాఠశాల స్థాయిలో చీరలను పంపిణీ చేయనున్నారు.

డీఈఓ కార్యాలయాలకు చీరలు చేరుకున్నాయి. బతుకమ్మ పండగకు మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న ప్రభుత్వం ఈ ఏడాది నుంచి మధ్యాహ్న భోజన కార్మికులకు అందిస్తుండటం శుభపరిణామం. అర్హులకు వారంలో పంపిణీ చేస్తాం. సోమశేఖర్‌శర్మ, డీఈఓ

# ఉద్యోగ విరమణ... విజిలెన్సు విచారణ?



కొత్తగూడెం :మణుగూరు ఏరియాలో ఓ ఉద్యోగి ఉద్యోగ విరమణ కార్యక్రమంపై విజిలెన్సు అధికారులు విచారణ చేపట్టారు. ఏరియాలోని సాంకేతిక విడిభాగాలు రూపొందించే ప్రాంతీయ కారా?నాలో పనిచేసే ఓ ఉద్యోగి సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. కార్యక్రమం కారా?నాలో అట్టహాసంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించటంపై విమర్శలు వెల్లువెత్తాయి. అధికారులు, ఉద్యోగులు విధులు నిర్వహించకుండా ఏరియా వర్కుషాపులో సదరు ఉద్యోగ విరమణ కార్యక్రమంలో పాల్గొనటంతో చర్చనీయాంశంగా మారింది. కార్మికులు విధులకు 10 నిమిషాలు ఆలస్యం అయితేనే అనుమతించని యాజమాన్యం, రోజంతా అధికారులు, ఉద్యోగులు పని చేయకుండా ఉత్పత్తికి విఘాతం కలిగేలా ఉద్యోగ విరమణ వేడుకలకు హాజరుకావటం గమనార్హం. సింగరేణిలో ఉద్యోగ విరమణ పొందిన కార్మికులను యాజమాన్యం సన్మానించటం పరిపాటి. ఆ కార్యక్రమానికి కార్మికుల కుటుంబ సభ్యులను యాజమాన్యం అనుమతించదు. కానీ సోమవారం జరిగిన ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఉద్యోగి కుటుంబ సభ్యులు, బంధువులు, సన్నిహితులతోపాటు, ప్రజాప్రతినిధులు వందల సంఖ్యలో పాల్గొన్నారు. భోజనాలు, జానపద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ తతంగం అంతా ఏరియాలో ఓ అధికారి పర్యవేక్షణలో జరిగిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగితో ఆ అధికారి సన్నిహితంగా ఉండటంతోనే వేడుక జరిగిందనే వాదనలు వ్యక్తమవుతున్నాయి. ఉద్యోగ విరమణ వేడుకను విజిలెన్సు అధికారులు వీడియో తీసి, ఉన్నతాధికారులకు చేరవేసినట్లు సమాచారం.

# పాతపైపులతో మరమ్మతు పనులు

మల్యాల : మల్యాల మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలోని సూరప్ప చెరువు పక్కన ఇటీవల వరద నీరు వెళ్లడానికి వీలుగా గండికొట్టిన బైపాస్ రహదారికి మరమ్మతు పనులు చేపట్టారు. ఇంజినీరింగు అధికారులు సరైన ప్రణాళికతో వంతెన నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో బైపాస్ రహదారి మధ్య ఏటా వరద నీరు వెళ్లడానికి వీలుగా గ్రామ పంచాయతీ అధికారులు గండికొడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బారీ వర్షాల కారణంగా గతనెల 27న బైపాస్ రహదారికి గండికొట్టారు. మూడేళ్ల నుంచి వరుసగా వర్షాల కారణంగా ఈ రహదారి మధ్య గండి కొడుతుండటంతో మల్యాల నుంచి పెగడపెల్లి మండలానికి రవాణా వ్యవస్థ దెబ్బతింటోంది. వారం క్రితం వరద చెరువులోకి వెళ్లడానికి వీలుగా మల్యాల నుంచి పెగడపెల్లి మండలానికి వెళ్లే సదరు బైపాస్ రహదారి మధ్య గండికొట్టడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో సర్పంచి సుదర్శన్, ఈవో రవీందర్ రహదారి మరమ్మతుకు చర్యలు చేపట్టారు. ఏళ్ల క్రితం జగ్గని ఒర్రెలో శ్రీనివాస్ అనే వ్యక్తి తన ఇంటికి వెళ్లడానికి వీలుగా పైపులతో నిర్మించుకున్న దారి కొట్టుకుపోవడంతో అవే పాత శిథిలమైన పైపులను తీసుకెళ్లి రహదారి మరమ్మతు పనులకు వినియోగిస్తుండటం పలు విమర్శలకు దారితీస్తోంది. గ్రామ పంచాయతీ ఈవో రవీందర్‌ను సంప్రదించగా త్వరలో వంతెన నిర్మాణం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

# ప్రకృతి విపత్తు.. విద్యుత్తు శాఖ చిత్తు

వరంగల్ : ఇటీవల కురిసిన భారీ వర్షాలు తెలంగాణ ఉత్తర విద్యుత్తు పంపిణీ సంస్థ (టీఎస్ఎన్పీడీసీఎల్)కు అపార నష్టాన్ని మిగిల్చాయి. ఉపకేంద్రాలు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు (డీటీఆర్) వరదనీటిలో మునిగాయి.. ఈదురు గాలులకు 11, 33 కేవీ లైన్ స్తంభాలు నేలకూలాయి.. బొందివాగు వరదలో డీటీఆర్‌లు మునిగిపోవడంతో వరంగల్ నగరంలో కరెంటు సరఫరా నిలిచింది. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షంలో పీటీఆర్, ఫీడర్లు, డీటీఆర్‌ల నుంచి కరెంటు సరఫరా పునరుద్ధరించడం అత్యంత సంక్లిష్టంగా మారింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు 14.28 లక్షల గృహ వినియోగదారులు ఉన్నారు. ఐదు రోజుల పాటు ఎడతెరిపిలేని వర్షాలతో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

తాత్కాలిక మరమ్మతులు..

వరంగల్ హంటర్‌రోడ్డు బొందివాగు నాలా ఉద్ధృతితో ఎన్టీఆర్‌నగర్, సంతోషిమాత కాలనీలో రెండు విద్యుత్తు స్తంభాలు కూలిపోయాయి. ఒక నియంత్రికపై దెబ్బతినింది. తాత్కాలిక మరమ్మతులతో కరెంటు సరఫరాను పునరుద్ధరించారు. రంగంపేట కూడలిలో నియంత్రిక



నీట మునగడంతో సరస్వతి కాలనీ, మున్సిపల్ ఉద్యోగుల కాలనీ, భద్రకాళి దేవాలయం రోడ్డుకు నాలుగు రోజుల పాటు విద్యుత్తు సరఫరా నిలిపివేసి, ఆదివారం పునరుద్ధరించారు.

నీట మునిగిన నియంత్రిక..నర్సంపేట రూరల్ సెక్షన్ పరిధిలో రెండు విద్యుత్తు నియంత్రికలు, 38 స్తంభాలు దెబ్బతిన్నాయి. గురిజాలలో పెద్ద చెరువు వాగు ప్రవాహానికి ట్రాన్స్‌ఫార్మర్ నీటిలో మునిగింది. విద్యుత్తు సరఫరా లేక తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు సర్పంచి మమత తెలిపారు. నియంత్రికను మరోచోటుకు మారుస్తామని ఏఈ సంపత్ తెలిపారు. ప్రస్తుతానికి చెన్నారావుపేట మండలంలోని ఉప్పరపల్లి ఉపకేంద్రం నుంచి విద్యుత్తు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. నర్సంపేట రూరల్

పునరుద్ధరణ

ఇటీవల కురిసిన వర్షాలకు విద్యుత్తు నియంత్రికలు దెబ్బతిన్నాయి. స్తంభాలు నేల కూలి 20గ్రామాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. మనుబోతులగడ్డ, మంగళవారిపేట, ధర్మారావుపేటల్లో నియంత్రికలు దెబ్బతిన్నాయి. ఆరు స్తంభాలు కూలాయి. సంబంధిత శాఖ సిబ్బంది వేగంగా పనులు చేపట్టి విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించినట్లు అధికారి సంపత్ తెలిపారు. ఖానాపురం

విరిగిపడిన స్తంభం

కొత్తపల్లి ఆకేరు వాగు నుంచి ఇల్లంద వెళ్లే దారిలో విద్యుత్తు నియంత్రికపై స్తంభం విరిగిపడింది. ఇల్లంద శివారులో మరో స్తంభం నేలకొరిగింది. రైతులు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, వారు వచ్చి పరిశీలించారు. ఇబ్బందులు తలెత్తకుండా ఇతర మార్గాల్లో విద్యుత్తు సరఫరా చేస్తున్నట్లు ఆ శాఖ సిబ్బంది ఒకరు తెలిపారు. నేలకొరిగిన స్తంభాలను పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు. వర్ధన్నపేట

తెప్పపై చెరువులోకి వెళ్లి..

ఖానాపురం మండలం దబ్బీరుపేటకు వెళ్లే లైన్ స్తంభాలకు ఇన్సులేటర్ పగిలి మూడు గ్రామాలకు రెండ్రోజుల పాటు విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. అశోక్‌నగర్ నుంచి లైన్‌ను చెక్ చేసినా అధికారులు దబ్బీరుపేట చెరువులోని స్తంభం లైన్ ఇన్సులేటర్ పగలి బ్రేక్‌డౌన్ అవుతున్నట్లు గుర్తించారు. దీంతో జేనియర్ లైన్‌మెన్ జాటోతు వినోద్ చెరువులో చేపల వేటకు మత్స్యకారులు ఉపయోగించే తెప్ప తెప్పించుకొని చెరువులోకి వెళ్లి స్తంభం ఎక్కి ఇన్సులేటర్ బిగించడంతో సమస్య పరిష్కారం అయింది. అతడి చొరవను ఎన్పీడీసీఎల్ అధికారులు అభినందించారు. నర్సంపేట

యుద్ధప్రాతిపదికన..కుండ పోత వర్షాలకు నర్సంపేట డివిజన్‌లో విద్యుత్తు శాఖకు రూ.20 లక్షలకు పైగా నష్టం జరిగింది. 250కి పైగా స్తంభాలు విరిగిపడ్డాయి. ఐదు నియంత్రికలు పాడయ్యాయి. సుమారు 80 గ్రామాల్లో రెండు రోజుల పాటు కరెంటు సరఫరా నిలిచి పోయింది. డీఈ సదానందం పర్యవేక్షణలో సిబ్బంది మరమ్మతు పనులు చేపట్టారు. విరిగిన స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి కరెంటు సరఫరా పునరుద్ధరించారు. నర్సంపేట

అంధకారంలో తండా వాసులు

నెక్కొండ మండలంలోని చెరవుముందరి తండా శివారు సోమ్లా తండా వాసులు అంధకారంలో ఉంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఐదు స్తంభాలు విరగడంతో కరెటు సరఫరా లేక చీకట్లో ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. నాలుగు రోజుల అనంతరం అధికారులు కొత్త స్తంభాలను ఏర్పాటు చేసినా, ఇంకా తీగలు బిగించలేదు. నెక్కొండ

# నమ్మండి.. వాగులు కావివి.. వరి పొలాలే

రామడుగు : రామడుగు మండలంలో మోతెవాగుకు ఆనుకుని ఉన్న పంట భూములు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పొలాలు కోతకు గురికావడంతోపాటు ఇసుక మేటలు వేయడంతో అన్నదాతల ఆశలు ఆవిరయ్యాయి. రామడుగు, షానగర్, కోరిటపల్లి, గోలిరామయ్యపల్లి, మోతె, కొక్కెరకుంట, వన్నారం గ్రామాల గుండా మోతె వాగు ప్రవహిస్తోంది. ఈ గ్రామాల్లో సుమారు 50 ఎకరాల పంట భూములు దెబ్బతిన్నాయి. వీటిని పూర్వ స్థితికి తీసుకురాలేమని రైతులు వాపోతున్నారు. గతేడాది భారీ వరదలకు మోతెవాగుపై ఉన్న ఆరు చెక్‌డ్యాంలు కొట్టుకుపోయాయి. ఆ సమయంలోనూ ఇదే పరిస్థితి ఉండగా.. రూ.లక్షలు వెచ్చించి ఇసుక మేటలు తొలగించిన రైతులు గత సీజన్‌లో యాసంగి పంట సాగు చేశారు. ఈసారీ భారీ వర్షాలు కురవడంతో మళ్లీ నష్టం వాటిల్లింది. చెక్‌డ్యాంలు కొట్టుకుపోయి ఉండడంతో వాగు ప్రవాహం కొత్త దారిలోకి మళ్లింది. రూ.లక్షలు విలువ చేసే పంట భూములు కోతకు గురికావడంతో అన్నదాతలు దిక్కు తోచని స్థితిలో ఉండిపోయారు. చిగురుమామిడి మండలంలోని చెరువులు, కుంటలు నిండి గండ్లు పడ్డాయి. వరి నాట్లు వేసిన పొలాల్లో ఇసుక మేటలు ఏర్పడి రైతులకు తీరని నష్టం వాటిల్లింది. సీతారాంపూర్, బండారిపల్లి, పెద్దమ్మపల్లి గ్రామాల్లో దాదాపు 70 ఎకరాల్లో ఇసుక మేటలు వేశాయి. వాటిని తీయాలంటే వేలాది రూపాయలు ఖర్చు అవుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీతారాంపూర్‌కి చెందిన నందయ్య, సమ్మయ్య అనే రైతులు తమకున్న రెండెకరాలలో.. ఎకరం పొలంలో ఇసుక మేటలు వేసి నాటు వేయరాకుండా ఉందని తెలిపారు. ఇసుక తొలగించడానికి తమ వద్ద డబ్బుల్లేవని ఆవేదన వ్యక్తం చేశారు.




# తెలంగాణ అభ్యర్ధన.. జలశక్తి శాఖ కీలక సమావేశం వాయిదా

దిల్లీ: నాగార్జునసాగర్ వద్ద చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి నేతృత్వంలో ఏర్పాటు చేసిన అత్యవసర సమావేశం వాయిదా పడింది. ఆదివారం ఎన్నికల కౌంటింగ్ ఉన్నందున తెలంగాణ అభ్యర్థన మేరకు సమావేశాన్ని ఈ నెల 6కి వాయిదా వేసింది. సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులకు సంబంధించి తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న వివాదాలపై ఈ నెల 6న మరోసారి చర్చించనున్నారు.

**అప్పటివరకు నీటి విడుదల నిలిపివేత :** కేంద్ర జలశక్తి శాఖ కార్యాలయంలో జరిగిన ఇవాల్టి సమావేశానికి తెలుగు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు (సీఎస్‌లు), సీఆర్‌పీఎఫ్, సీఐఎస్‌ఎఫ్ డైరెక్టర్ జనరల్‌లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. సీడబ్ల్యూసీ, కృష్ణా బోర్డు ఛైర్మన్‌లు నేరుగా పాల్గొన్నారు. తమ నీటి అవసరాలు, ప్రాజెక్టుల వద్ద పరిస్థితిని ఏపీ అధికారులు వివరించారు. ఏపీ పంపిన ఇండెంట్‌పై ఈ నెల 4న నిర్ణయం తీసుకోవాలని కృష్ణానదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)ను జలశక్తి శాఖ ఆదేశించింది. అప్పటివరకు సాగర్ నుంచి నీటి విడుదల నిలిపివేయాలని ఏపీకి సూచించింది.

**బోర్డుకు అప్పగించే యోచనలో..!** అలాగే నాగార్జునసాగర్, శ్రీశైలం జలాశయాలు వాటికి అనుబంధంగా ఉన్న ఉమ్మడి నిర్మాణాలను కృష్ణానదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)కు అప్పగించే ప్రక్రియను కేంద్ర జలశక్తి శాఖ ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది.

గత మూడు రోజులుగా నాగార్జునసాగర్ వద్ద చోటు చేసుకున్న పరిణామాలను కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. కేఆర్ఎంబీ పర్యవేక్షణలో ప్రాజెక్టులను సీఆర్‌పీఎఫ్, సీఐఎస్‌ఎఫ్ భద్రత పరిధిలోకి రెండు జలాశయాలను తీసుకురావాలని యోచన చేస్తోంది. జలాశయాల నిర్వహణ మొత్తం కేఆర్ఎంబీకే అప్పగించాలని కేంద్రం ఇప్పటికే కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ అంశాలపై సమావేశంలో చర్చించినట్లు సమాచారం.

# దూసుకొస్తున్న 'మిచాంగ్' తుపాను.. ఐఎండీ రెడ్ అలర్ట్




అమరావతి: నైరుతి బంగాళాఖాతంలో వాయుగుండం తీవ్ర వాయుగుండంగా బలపడింది. రేపటికి తుపానుగా మారే అవకాశముందని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ఆ తర్వాత దక్షిణకోస్తా తీరానికి సమాంతరంగా పయనించనుందని, మంగళవారం మధ్యాహ్నం నెల్లూరు-మచిలీపట్నం మధ్య తీరం దాటే అవకాశముంది. నెల్లూరు జిల్లా వైపు మిచాంగ్ తుపాను దూసుకొస్తుంది. ఐఎండీ రెడ్ ఎలర్ట్ ప్రకటించింది. తుపాను హెచ్చరికల నేపథ్యంలో 4వ తేదీ జిల్లాలోని అన్ని విద్యా సంస్థలకు జిల్లా కలెక్టర్ ఎం హరి నారాయణన్ సెలవు ప్రకటించారు. తుపాను ప్రభావంతో ఆదివారం నుండి మంగళవారం వరకు రాష్ట్ర వ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురవనున్నాయి. మంగళవారం అక్కడక్కడ భారీ నుంచి అతి భారీ వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. ఆదివారం నుంచి కోస్తా తీరం వెంబడి గంటకు 80 - 100 కిమీ వేగంతో బలమైన గాలులు వీస్తాయని, మత్స్యకారులు మంగళవారం వరకు వేటకు వెళ్లరాదని, రైతులు వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ అంబేద్కర్ హెచ్చరించారు. బంగాళాఖాతంలో ఏర్పడనున్న తుపాను కోస్తాంధ్రతో పాటు, రాయలసీమలోనూ పెను ప్రభావం చూపనుంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తోంది. తుపాను ప్రభావిత జిల్లాల అధికారులు అప్రమత్తంగా ఉండాలుని, ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించింది. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసింది. తాడేపల్లిలో రాష్ట్ర కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి, ఫోన్ నంబర్లను ప్రజలకు అందుబాటులోకి తెచ్చింది. విపత్కర పరిస్థితుల్లో ప్రజలను రక్షించేందుకు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధం చేసింది.

# రాజకీయ లబ్ధి కోసమే జగన్ నీటి చిచ్చు పెట్టారు: ధూళిపాళ్ల నరేంద్ర



మంగళగిరి: రాష్ట్ర నీటి హక్కుల ముసుగులో స్వార్థ ఆర్థిక ప్రయోజనాలే లక్ష్యంగా సాగర్‌పై దండయాత్ర చేశారని తెదేపా నేత ధూళిపాళ్ల నరేంద్ర ఆరోపించారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "రాజకీయ లబ్ధి కోసమే జగన్ నీటి చిచ్చు పెట్టారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం పోలీసులను జగన్ ఉసిగొలిపారు. డెల్టా రైతులు మొత్తుకున్నా సీఎం జగన్ నోరు మెదపలేదు.

హఠాత్తుగా తెలంగాణ ఎన్నికల రోజు జగన్నాటకానికి తెరలేపారు. తెలుగువారి మధ్య చిచ్చుపెట్టడమే జగన్ లక్ష్యమా? రాష్ట్ర సమస్యలపై నాలుగున్నరేళ్లుగా జగన్ ఎందుకు ప్రశ్నించలేదు? ప్రజలను ఇంకెంత కాలం మోసం చేస్తారు?" అని ధూళిపాళ్ల ప్రశ్నించారు.

# ఏపీలో ఇసుక అక్రమాలపై హైకోర్టులో పిల్



అమరావతి: రాష్ట్రంలో ఇసుక అక్రమాలు, కాంట్రాక్ట్ ముగిసిన తవ్వకాలపై హైకోర్ట్‌లో పిల్ దాఖలైంది. వేల కోట్లు రూపాయలు దుర్వినియోగంపై ఆధారాలుతో సహా పిటిషనర్ పిల్‌లో చేర్చారు. దండ నాగేంద్ర అనే వ్యక్తి తరపున హైకోర్ట్ న్యాయవాది వీవీ లక్ష్మీనారాయణ పిటీషన్ వేశారు. ఈ యేడాది మే 2న కాంట్రాక్ట్ ముగిసినప్పటికీ కొనసాగించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సబ్ కాంట్రాక్టర్ టర్న్ కీ సంస్థ పేరిట త్రవ్వకాలు చేశారంటూ బిల్లులతో సహా పిటీషన్‌లో చేర్చారు. అక్రమ తవ్వకాల వలన నదీ ప్రవాహ దిశ మారుతుందని ఆగ్రహం వ్యక్తం చేసిన ఇన్లాండ్ వాటర్ వేస్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నివేదికను కూడా న్యాయవాది లక్ష్మీనారాయణ పిల్‌లో పొందుపరిచ్చారు. ఎన్జీటీ తవ్వ కాలు ఆపివేయాలని కోరినా వినిపించుకోని ప్రభుత్వ తీరును న్యాయవాది వివరించారు. రాష్ట్రంలో నేటికీ జరుగుతున్న అక్రమ తవ్వకాలను వీడియో క్లిప్పింగ్‌లు, ఫోటోలతో సహ పిటీషన్‌లో మెన్షన్ చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న అక్రమ తవ్వకాల వెనుక ప్రభుత్వ పెద్దలు హస్తం ఉందని పిటీషన్‌లో పేర్కొన్నారు. ఈ పిల్‌పై హైకోర్టులో వచ్చే వారం విచారణకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# యువతకు మంచి అవకాశం..'ఆడుదాం ఆంధ్రా'

## క్రీడా టోర్నమెంట్ల వీడియో లాంచ్ ,బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో మంత్రి ఆర్కే రోజా

## ఆడుదాం ఆంధ్రా రాష్ట్ర చరిత్రలోనే అతిపెద్ద క్రీడా సంబరం: శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి



విజయవాడ : దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఆడుదాం ఆంధ్రా వంటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టలేదని రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. ఆడుదాం ఆంధ్రా పేరుతో ఏపీ ప్రభుత్వం నిర్వహిస్తున్న రాష్ట్రవ్యాప్త క్రీడా టోర్నమెంట్ల వీడియో లాంఛ్ ,బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డితో కలిసి రోజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ' ప్రస్తుతం యువతలో ఫిజికల్ ఫిట్‌నెస్ సరిగా ఉండటం లేదు. ఆడుదాం ఆంధ్రా యువతకు మంచి అవకాశం. టోర్ణమెంట్‌లో 12 కోట్ల రూపాయల ప్రైజ్ మనీ అందిస్తున్నాం' అని రోజా తెలిపారు. '100 కోట్ల బడ్జెట్‌తో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నాం. టోర్ణమెంట్‌లో పాల్గొనేందుకుగాను 72 గంటల్లో 5 లక్షల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇంతమంచి అవకాశం మళ్లీ వస్తుందో లేదో ...ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలి. కోటి మంది వరకు రిజిస్ట్రేషన్ చేసుకుంటారని భావిస్తున్నాం. ఏపీని ఆటల ఆంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దాలనేదే సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి లక్ష్యం. ఆడపిల్లలు కూడా ఉత్సాహంగా పాల్గొనాలి' అని రోజా కోరారు.

**శాప్ ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ్ రెడ్డి మాట్లాడుతూ...** 'రాజకీయ నాయకులు ఎన్నికలప్పుడే వస్తారనే అభిప్రాయం ప్రజల్లో ఉండేది. సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఏపీలో ఒక ట్రెండ్‌ను సృష్టించారు ప్రభుత్వం ఏ ర్పడిన దగ్గర్నుంచి ప్రతీ నాయకుడిని నిత్యం జనాల్లో ఉండేలా చూశారు. ఆడుదాం ఆంధ్రా రాష్ట్ర చరిత్రలోనే అతిపెద్ద క్రీడా సంబరం. గ్రామీణ స్థాయిలో క్రీడాకారులను ప్రోత్సహించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం' అని తెలిపారు.




# 'ఆదిత్య-ఎల్ 1'లో రికార్డయిన సౌరగాలులు.. ఫొటో షేర్ చేసిన ఇస్రో

బెంగళూరు: సూర్యుడిని అధ్యయనం చేసేందుకు రోదసిలోకి దూసుకెళ్లిన 'ఆదిత్య-ఎల్ 1' తన ప్రయాణంలో మరో మైలురాయిని అందుకుంది. ఈ ఉపగ్రహంలోని ఆదిత్య సోలార్ విండ్ పార్టికల్ ఎక్స్‌పరిమెంట్ పేలోడ్ తన ఆపరేషన్స్‌ను ప్రారంభించిందని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో తాజాగా వెల్లడించింది. ఈ పేలోడ్‌లోని రెండు పరికరాలు పరిశోధనలను విజయవంతంగా కొనసాగిస్తున్నాయని, ఇవి సౌర గాలులను అధ్యయనం చేస్తున్నాయని తెలిపింది. ఈ ఆదిత్య సోలార్ విండ్ పార్టికల్ ఎక్స్‌పరిమెంట్ పేలోడ్‌లో రెండు పరికరాలు ఉన్నాయి. ఇందులోని సూపర్‌థర్మల్ అండ్ ఎనర్జిటిక్ పార్టికల్ స్పెక్ట్రోమీటర్‌ను సెప్టెంబరు 10న, సోలార్ విండ్ అయాన్ స్పెక్ట్రోమీటర్‌ను నవంబరు 2న యాక్టివేట్ చేశారు. ఈ రెండు తమ కార్యకలాపాలను సజావుగా సాగిస్తున్నాయని ఇస్రో తమ తాజా ప్రకటనలో వెల్లడించింది. స్విస్‌లో ఉన్న రెండు సెన్సర్లు 360 డిగ్రీల్లో తిరుగుతూ పనిచేస్తున్నాయి. ఇవి నవంబరులోని రెండు తేదీల్లో సోలార్ విండ్ అయాన్లు, ప్రైమరీ ప్రోటాన్స్, ఆల్ఫా పార్టికల్స్‌ను విశ్లేషించినట్లు ఇస్రో తెలిపింది. ఈ సెన్సర్ సేకరించిన ఎనర్జీ హిస్టోగ్రామ్‌ను పరిశీలించిన తర్వాత.. ప్రోటాన్, ఆల్ఫా పార్టికల్స్‌లో కొన్ని వైవిధ్యాలు ఉన్నట్లు గుర్తించామని ఇస్రో పేర్కొంది. ఈ తాజా విశ్లేషణతో.. సౌర గాలుల లక్షణాలపై సుదీర్ఘంగా నెలకొన్న ఎన్నో ప్రశ్నలకు సమాధానాలు దొరికే అవకాశముందని ఇస్రో వివరించింది. అంతేగాక, సౌర గాలుల్లో అంతర్లీనంగా ఉండే ప్రక్రియలు, భూమిపై అవి ఎలాంటి ప్రభావం చూపుతాయనే విషయంపై సమగ్ర అధ్యయనం చేసేందుకు ఈ సమాచారం ఉపయోగపడుతుందని తెలిపింది. ఇక, లాగ్రాంజ్ పాయింట్ వద్ద చోటుచేసుకునే కరోనల్ మాస్ ఎజెక్షన్‌పై ఓ అవగాహనకు రావచ్చని వెల్లడించింది. సూర్యుడిపై అధ్యయనం కోసం ఈ ఏడాది సెప్టెంబరు 2న నింగిలోకి దూసుకెళ్లిన 'ఆదిత్య - ఎల్ 1' తన ప్రయాణంలో దాదాపు చివరి దశను చేరుకుంది. ఈ ఉపగ్రహాన్ని ఎల్1 పాయింట్‌లో ప్రవేశపెట్టేందుకు నిర్వహించాల్సిన విన్యాసాలు వచ్చే ఏడాది జనవరి 7వ తేదీ నాటికి పూర్తవుతాయని ఇటీవల ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ తెలిపారు. భూమి నుంచి 15 లక్షల కి.మీ దూరంలో ఉన్న లాగ్రాంజ్ పాయింట్-1 చేరాక.. దాని కక్ష్యలో పరిభ్రమిస్తూ ఆదిత్య - ఎల్ 1 సూర్యుడిని అధ్యయనం చేస్తుంది.




జెరూసలెం: ఇజ్రాయెల్-హమాస్ మధ్య సంధి గడువు ముగిసిపోవడంతో గాజాలో మళ్లీ బాంబులు పేలుతున్నాయి. కాల్పుల విరమణ కోసం కుదిరిన ఒప్పందం నిలిచిపోవడానికి హమాస్ చర్యలే కారణమని అమెరికా నిందించింది. అది ఒప్పందాన్ని గౌరవించకుండా, ఉల్లంఘనలకు పాల్పడిందని విమర్శించింది. ఒప్పందం నిబంధనలను హమాస్ ఉల్లంఘించడం వల్లే మళ్లీ పేలుళ్లు మొదలయ్యాయని అమెరికా విదేశాంగశాఖ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ అన్నారు. జెరూసలెంలో జరిగిన దాడిని, సంధి ముగియకముందే హమాస్ వైపు నుంచి రాకెట్లు దూసుకురావడాన్ని ఆయన ప్రస్తావించారు. ఈ విరామం ఎందుకు ఆగిపోయిందో అందరూ అర్థం చేసుకోవడం ముఖ్యమన్నారు. 'కాల్పుల విరమణ గడువు ముగియడానికి ముందే హమాస్ దారుణమైన ఉగ్రదాడికి పాల్పడింది. ఆ ఘటనలో ముగ్గురు వ్యక్తులు మరణించారు. పలువురు గాయపడగా.. అందులో అమెరికన్లు ఉన్నారు. అంతేగాకుండా మిలిటెంట్లు రాకెట్లను పేల్చారు. ఈ ప్రాంతంలో శాంతి నెలకొనాలన్నదే అమెరికా ఉద్దేశం. బందీల విడుదలపైనే మా దృష్టంతా ఉంది. అలాగే ఇజ్రాయెల్‌కు, అక్టోబర్ 7 లాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఆ దేశం చేసే ప్రయత్నాలకు మా మద్దతు ఎప్పటికీ ఉంటుందని ఇప్పటికే స్పష్టం చేశాం' అని తెలిపారు. అక్టోబర్ 24న ఇజ్రాయెల్-హమాస్ మధ్య గాజాలో కాల్పుల విరమణ, బందీల బదిలీ ఒప్పందం జరగడంతో వారం రోజుల పాటు దాడులు చోటుచేసుకోలేదు. తొలుత నాలుగు రోజులే ఒప్పందం చేసుకున్నప్పటికీ, అనంతరం బందీల విడుదల కోసం ఈ వ్యవధిని పెంచారు. ఈ గడువు శుక్రవారం ఉదయంతో ముగిసింది. కాల్పుల విరమణను ఇంకా కొన్నిరోజులపాటు కొనసాగించాలని అంతర్జాతీయ సమాజం నుంచి ఒత్తిడి వచ్చినప్పటికీ దాడులు మళ్లీ ప్రారంభమయ్యాయి. హమాస్ తొలుత ఒప్పందాన్ని ఉల్లంఘించిందని ఆరోపిస్తూ ఇజ్రాయెల్ వైమానిక, భూతల దాడులకు దిగింది. దీంతో బందీల విడుదల ఆగిపోయింది.

# ఫారం-7 గంపగుత్త అప్లికేషన్లు తీసుకోవడానికి వీల్లేదు: పయ్యావుల




అనంతపురం: ఓట్లు తొలగించేందుకు ఫారం-7 ద్వారా గంపగుత్త అప్లికేషన్లు తీసుకోవడానికి వీల్లేదని ఈసీ ఇచ్చిన ఆదేశాలు.. తాము చేస్తున్న పోరాటంపై స్పష్టత ఇచ్చినట్లు అయ్యిందని తెదేపా ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ అన్నారు. అనంతపురంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పయ్యావుల మాట్లాడారు. ఓట్లు తొలగించాలని అధికారులపై వైకాపా నాయకులు తీవ్ర ఒత్తిడి చేస్తున్నారని మండిపడ్డారు. ఓటు ఎక్కడ ఉండాలనేది ఓటరు హక్కు, రెండు ఓట్లు ఉంటే తప్పు అని ఆయన స్పష్టం చేశారు. ఓటమి భయంతోనే ఉరవకొండలో వైకాపా నేత విశ్వేశ్వర్ రెడ్డి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. "విశ్వేశ్వర్ రెడ్డి నీతి సూత్రాలు చెబుతుంటే ఆశ్చర్యమేస్తోంది. ఆయన జీవితమంతా బ్లాక్‌మెయిల్ రాజకీయాలే. టికెట్ ఇవ్వకపోతే పార్టీ మారతానని బ్లాక్‌మెయిల్ చేసేవారు. నేడు స్పష్టంగా ఎన్నికల సంఘం ఉత్తర్వులు ఇచ్చింది. ఫారం-7 గంపగుత్త అప్లికేషన్లు తీసుకోవడానికి వీల్లేదు. తప్పులు కళ్ల ముందే జరుగుతుంటే పరిశీలకులు ఏం చేస్తున్నారు? మా ఫిర్యాదులపై ఏం స్పందించారో వారే చెప్పాలి. నిష్పక్షపాతంగా పనిచేస్తే మేం ఫిర్యాదు చేయాల్సిన అవసరం లేదు కదా? విశ్వేశ్వర్ రెడ్డి ఇంట్లో ఎన్ని ఓట్లు ఉన్నాయో చూపించమంటారా?" అని పయ్యావుల ప్రశ్నించారు. కాగా, పయ్యావుల ఫిర్యాదు మేరకు ఫారం-7 గంపగుత్తగా సమర్పించకూడదని ఉత్తర్వులు జారీ చేస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం శనివారం కీలక ఆదేశాలు ఇచ్చింది.

# జనసేనలోకి నాలుగు జిల్లాల వైసీపీ ముఖ్య నేతలు

అమరావతి: నాలుగు జిల్లాలకు చెందిన వైసీపీ ముఖ్య నేతలు జనసేనలో చేరారు. శనివారం జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సమక్షంలో వైసీపీ ముఖ్య నేతలు పార్టీలో చేరారు. వారికి పవన్ కళ్యాణ్ జనసేన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

**జనసేనలో చేరిన వారి వివరాలు:** చిలకలపూడి పాపారావు.. సర్పంచుల సంఘం అధ్యక్షుడు - కృష్ణాజిల్లా వైసీపీ, చిక్కాల దొరబాబు - తూర్పుగోదావరి వైసీపీ నాయకులు, దుగ్గన నాగరాజు - తూర్పుగోదావరి వైసీపీ నాయకులు, కలగపాల్ పురుషోత్తం - తూర్పుగోదావరి వైసీపీ నాయకులు, ఎదురువాక శ్రీ వెంకటగిరి- తూర్పుగోదావరి వైసీపీ నాయకులు, పొగిరి సురేష్ బాబు - శ్రీకాకుళం జిల్లా వైసీపీ నాయకులు, వై శ్రీనివాస్ రాజు - కడప జిల్లా వైసీపీ నాయకులు.

# ఫిషింగ్ హార్బర్ ప్రమాదంలో బాధిత మత్స్యకారులకు కేంద్రం సహకారం



విశాఖపట్నం: ఫిషింగ్ హార్బర్‌లో బోట్లు దగ్ధమైన స్థలాన్ని బీజేపీ నేత జీవీఎల్ నరసింహారావు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఫిషింగ్ హర్బర్ ప్రమాదంలో మత్స్యకారులకు అపారమైన నష్టం జరిగిందన్నారు. మత్స్యకారులను తక్షణమే న్యాయం చేయమని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరామన్నారు. బాధిత మత్స్యకారులకు న్యాయం జరిగేలా కేంద్ర ప్రభుత్వం సహకరిస్తుందని తెలిపారు. దగ్ధమైన బోట్లను బయటికి వెలికితీయమని పోర్టు అధికారులతో మాట్లాడామని.. వెలికితీసిన బోట్లలను, బోటు యజమానికే ఇవ్వమని కోరడం జరిగిందన్నారు. పూర్తిగా పోర్టు ట్రస్టు ఆధ్వర్యంలో బోటులను వెలికితీయనున్నారన్నారు. ఖర్చులన్నీ పోర్టు అధికారులే భరించనున్నారని తెలిపారు. త్వరలో బ్యాంకు అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి, ఋణాలను ఇచ్చే విధంగా కృషి చేస్తున్నామని జీవీఎల్ నరసింహారావు వెల్లడించారు.

## పూజా హెగ్డే.. ఏంటమ్మా ఈ గ్లామర్ డోస్

నిన్న,మొన్నటి వరకు టాలీవుడ్ క్రేజీ హీరోయిన్ ఎవరు అంటే ముందుగా పూజా హెగ్డే పేరే వినపడేది. మొన్నటి వరకు ఆమె జోరు అలా సాగింది. ఇప్పుడే కాస్త డల్ అయ్యింది. రెండు, మూడు సినిమాల ఛాన్సులు చేతుల వరకు వచ్చి చేజారాయి. కానీ లేకుంటే మరో రెండు ఏళ్లు పూజాకి తిరుగు ఉండేది కాదు. ప్రస్తుతం పూజా చేతిలో తెలుగులో ఎలాంటి సినిమాలు లేవు. అయినా, ఫ్యాన్స్ బాధపడకుండా ఉండేందుకు సోషల్ మీడియా ద్వారా మాత్రం అలరిస్తూనే ఉంటుంది. ఎప్పటికప్పుడు తన ఫోటోలు షేర్ చేసి మెస్మరైజ్ చేస్తూ ఉంటుంది. తాజాగా కూడా బార్బీ గర్ల్ లా ముస్తాబైంది. పింక్ కలర్ డ్రెస్ లో చాలా క్యూట్ గా ఉంది. పై నుంచి కింద వరకు పింక్ కలర్ సింగిల్ డ్రెస్ ధరించింది. అయితే, క్లీవేజ్ షో మాత్రం పక్కన పెట్టలేదు. ఈ డ్రెస్ లోనూ తన హాట్ అందాలు కనిపించేలా ఫోటోలకు ఫోజులు ఇవ్వడం విశేషం. ఈ ఫోటోలు ప్రస్తుతం ఆమె అభిమానులను



విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. హౌ క్యూట్ అంటూ కొందరు, గార్జియస్ అంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ ఫోటోలు వైరల్ గా మారాయి. ఇదిలా ఉండగా, వరుణ్ తేజ్ ముకుంద సినిమాతో పూజ తెలుగు తెరుకు పరిచయమైంది. ఆ తర్వాత ఒక లైలా కోసం లో నాగచైతన్య సరసన నటించింది. ఈ రెండు సినిమాలు క్లిక్ అవ్వలేదు.మొదట్లో అందరూ బ్యాడ్ లక్ అనుకున్నారు. కానీ, తర్వాతే తాను అందరికీ గోల్డెన్ లెగ్ మారిపోయింది. రెండు వరస ఫ్లాప్ ల తర్వాత ఆమెకు అల్లు అర్జున్ సరసన డీజేలో నటించే అవకాశం వచ్చింది. అందులో గ్లామర్ డోస్ పెండచంతో అందరి దృష్టి ఆమెపై పడింది. కానీ అది కూడా క్లిక్ కాకపోవడంతో ముంబయి కి చెక్కేసింది. ఇక టాలీవుడ్ లో పూజ కెరీర్ అయిపోయినట్లే అనుకునే సమయంలో ఆమెకు అలవైకుంఠ పురంతో హిట్ పడింది. అంతే, అక్కడి నుంచి పూజ మళ్లీ వెనక్కి తిరిగి చూసుకోలేదు. ఆమెకు ఆఫర్లు క్యూ కట్టాయి. దాదాపు టాలీవుడ్ లోని స్టార్ హీరోలందరి సరసన ఆమే నటించింది. యువ హీరోయిన్లు ఎంత మంది వచ్చినా, పూజా స్థానాన్ని చేరుకోలేకపోయారు. కానీ, ఇటీవల కొన్ని కారణాల వల్ల ఆమె రెండు పెద్ద ప్రాజెక్టుల నుంచి తప్పుకోవడం గమనార్హం. మళ్లీ, కొత్త ఏ సినిమా సంతకం చేసినట్లు సమాచారం లేదు.

## లెహంగాలో క్లీవేజ్ ఫోజులతో కవ్విస్తున్న అలాయా..!

బాలీవుడ్ లో ఈ మధ్యకాలంలో వరస అవకాశాలు అందుకుంటోన్న బ్యూటీ అలాయా. ఈ బామ ఇండస్ట్రీలోకి ఇటీవలే అడుగుపెట్టింది. కానీ, అడుగుపెట్టి పెట్టగానే అందరినీ తన అందంతో ఆకర్షించడం మొదలుపెట్టింది. జవానీ జానేమన్ సినిమాతో అలాయా బాలీవుడ్ లో అడుగుపెట్టింది. మొదటి సినిమాలోనే ఆమె అందానికి అందరూ ఫిదా అయిపోయారు. ఆ తర్వాత ఆమెకు మరో, రెండు మూడు సినిమాల్లో ఛాన్సులు వచ్చాయి. కార్తీక్ ఆర్యన్ తో కలిసి ఫ్రెడ్డీ మూవీలో నటించింది. ఈ మూవీలో గ్లామర్ కూడా ఒలకబోసింది. లిప్ లాక్ సీన్లతో హీటు కూడా పెంచింది. కానీ ఈ మూవీ పెద్దగా క్లిక్ కాలేకపోయింది. కాగా, ఈ బ్యూటీ సోషల్ మీడియాలోనూ చాలా చురుకుగా ఉంటుంది. ఎప్పటికప్పుడు తన



అందాలను సోషల్ మీడియాలో ఆరబోస్తూ ఉంటుంది. తాజాగా లెహంగాలో మెరిసింది. క్లీవేజ్ షోతో హీటు పెంచేసింది. ఈ ఫోటోలు చూసి కుర్రాళ్ల మతిపోతోంది. హాట్, సూపర్ అంటూ ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఈ అలాయా పూర్తి పేరు అలాయా ఇబ్రహీం ఫర్నీచర్ వాలా. ఒకప్పటి అందాల తార పూజా బేడీ కుమార్తె ఈ అలాయా. కబీర్ బేడీకి మనవరాలు. ముంబయిలోని జమ్నాబాయి నర్సీ స్కూల్ లో చదువుకుంది. సినిమాల్లో ఎంట్రీ ఇవ్వక ముందే న్యూయార్క్ ఫిల్మ్ అకాడమీలో యాక్టింగ్ మొదలుపెట్టింది. ఆ తర్వాతే తన పేరును అలాయా ఎఫ్ గా మార్చుకుంది. కాగా, ఈమె తన మొదటి సినిమాలోనే గర్భిణీ గా నటించి అందరికీ షాకిచ్చింది, ఇక ఫ్రెడ్డీ మూవీలో సైతం హీరోని మోసం చేసే పాత్రలో నటించింది. గ్లామర్ గా కనిపిస్తూనే, నటకు ప్రాధాన్యత ఉన్న పాత్రలను ఎంచుకుంటూ ముందుకు దూసుకుపోతోంది. మొదటి సినిమాలోనే తన నటనకు ఫిల్మ్ ఫేర్ అవార్డు అందుకోవడం విశేషం. అలాయాకు ఇన్ స్టాగ్రామ్ లో 1.3 మిలియన్ ఫాలోవర్స్ ఉన్నారు. ఈ ఏడాది ఆమె యూటర్న్ అనే మూవీ తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇది సమంత చేసిన యూటర్న్ కి రీమేక్ కావడం విశేషం.




## శ్రీదేవి కంటే జాన్వీ పారితోషికం అన్ని రెట్లు ఎక్కువ!



అతిలోక సుందరి శ్రీదేవి దక్షిణాదిన వెండి తెరకు పరిచయమై, అగ్ర నాయికగా ఏలడమే గాక, అటుపై ఉత్తరాదినా నంబర్ వన్ తారగా వెలుగొందారు. శ్రీదేవి తన మొదటి తమిళ చిత్రంలో పూర్తి స్థాయి ప్రధాన పాత్రలో నటించారు. ఆ సినిమాకి శ్రీదేవి అందుకున్న పారితోషికంతో పోలిస్తే, ఇప్పుడు తన నటవారసురాలు జాన్వీ కపూర్ తెలుగు అరంగేట్రం దేవర కోసం కొన్ని రెట్లు అధిక పారితోషికం అందుకుంటున్నారు. నాటి కాలంతో పోలిక చూడటం సరికాదు.. కానీ ఫీజులో భారీ వ్యత్యాసం ఇప్పుడు చర్చగా మారింది. అతిలోక సుందరి శ్రీదేవి దేశంలోని అతిపెద్ద సూపర్‌స్టార్‌లలో ఒకరిగా దశాబ్దాల పాటు కొనసాగారు. దివంగత నటి కూడా తన కాలంలో అత్యధిక పారితోషికం పొందిన కథానాయికల్లో ఒకరిగా పాపులరయ్యారు. అయితే సూపర్‌స్టార్‌లు రజనీకాంత్, కమల్ హాసన్‌లతో తన మొదటి తమిళ చిత్రానికి (నాయకుడిగా) చెల్లించిన పారితోషికం గురించి తెలిస్తే ఆశ్చర్యపోతారు. తమిళ రొమాంటిక్ థ్రిల్లర్ మూండ్రు ముడిచులో ప్రధాన పాత్రలో నటించడానికి శ్రీదేవికి కేవలం రూ. 5000 మాత్రమే చెల్లించారు. ఈ చిత్రానికి %ఖ% బాలచందర్ దర్శకత్వం వహించారు. ఆయనే రచయిత. శ్రీదేవి కేవలం 13 ఏళ్ల వయస్సు(టీనేజర్ గా)లో మొదటి ప్రధాన పాత్ర ఇది! అయితే జాన్వీ కపూర్ తెలుగు అరంగేట్రం, జూనియర్ ఎన్టీఆర్ నటించిన దేవరతో పోల్చితే శ్రీదేవికి మొదటి చిత్రానికి చెల్లించిన ఫీజు పరిగణించదగినదేనా? ఒక ప్రముఖ కథనం ప్రకారం.. జాన్వీ తన సౌత్ అరంగేట్రానికి రూ.3.5 కోట్లు వసూలు చేస్తోంది. శ్రీదేవి డెబ్యూ ఫీజుతో పోలిస్తే ఈ డిఫరెన్స్ కు ఆశ్చర్యపోవాల్సిందే. జాన్వీ తన తెలుగు సినిమా దేవర కోసం అందుకుంటున్న మొత్తం.. కొన్నేళ్ల క్రితం తన తల్లి శ్రీదేవికి చెల్లించిన దానికంటే 6,99,900 శాతం ఎక్కువ అని విశ్లేషిస్తున్నారు! ఆసక్తికరంగా.. జాన్వీ కపూర్ హిందీ అరంగేట్రం ధడక్ కోసం కూడా మూండ్రు ముడిచుకి శ్రీదేవి ఫీజు కంటే చాలా రెట్లు ఎక్కువ.

**హిందీ డెబ్యూ ధడక్ కోసం జాన్వీ కపూర్ ఫీజు :** జాన్వీ కపూర్ తన హిందీ తొలి చిత్రం ధడక్ కోసం 60 లక్షలు అందుకోగా, శ్రీదేవి తొలి పారితోషికం కంటే దాదాపు 1,19,900 శాతం ఎక్కువ. జాన్వీ ధడక్ సినిమాతో హిందీలో అడుగుపెట్టగా, శ్రీదేవి 1975లో జూలీతో హిందీలో అరంగేట్రం చేసింది. శ్రీదేవి కెరీర్ ఉత్తమ అరంగేట్రం 1979లో సోల్వా సావన్‌తో కుదిరింది. ఇది బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ అయింది.

**శ్రీదేవి – అత్యధిక పారితోషికం తీసుకునే నటి! :** శ్రీదేవితన వరుస హిట్‌లతో బాక్స్-ఆఫీస్ వద్ద సూపర్ స్టార్ హోదాను పొందింది. పురుష వేతనంతో సమాన వేతనం డిమాండ్ చేసిన మొదటి నటిగా కూడా రికార్డులకెక్కింది. నిజానికి, 1 కోటి పారితోషికం కూడా డిమాండ్ చేసిన మొదటి నటి. ప్రేక్షకుల్లో గొప్ప పట్టు ఇమేజ్ ఉంది కాబట్టి, శ్రీదేవి కోట్ చేసిన పారితోషికాన్ని నిర్మాతలు చెల్లించారు.

**జాన్వీ కపూర్ ఫీజు తగ్గింది! :** జాన్వీ కపూర్ విషయానికి వస్తే, ఈ బ్యూటీ కేవలం 60 లక్షల ఫీజుతో తన కెరీర్‌ను ప్రారంభించింది. ఒక్కో ప్రాజెక్ట్‌కు 6 కోట్లు వసూలు చేస్తోందని కథనాలొచ్చాయి. కానీ వరుస ఫ్లాప్‌లతో ఈ బ్యూటీ తన ఫీజును తగ్గించుకుంది. నితేష్ తివారీ బావాల్ కోసం జాన్వీ కపూర్ కు 3 కోట్లు చెల్లించారన్న టాక్ కూడా ఉంది. కాబట్టి, శ్రీదేవి అత్యధిక పారితోషికం తీసుకునే నటిగా స్థానాన్ని కైవసం చేసుకునే సమయానికి ఆమె జీతం దాదాపు 2000 రెట్లు పెరిగింది. తన మొదటి రుసుము 5000 నుండి 90లలో సినిమాలకు 1 కోటి పొందింది. అయితే 60 లక్షల నుండి దేవరతో 3.5 కోట్లకు ఎదగడం వరకు జాన్వీ కపూర్ ఫీజు కేవలం 5.8 రెట్లు పెరిగింది. అభినయనేత్రి శ్రీదేవి వేసిన దారిలో నడవడం చాలా కష్టం. కానీ జాన్వీ నెమ్మదిగా స్థిరంగా అత్యుత్తమ స్థానానికి చేరుకుంటుందని అభిమానులు ఆకాంక్షిస్తున్నారు. కెరీర్ మ్యాటర్ కి వస్తే..తదుపరి మిస్టర్ అండ్ మిసెస్ మహిలో నటించింది. తెలుగు తొలి చిత్రం దేవరలో నటిస్తోంది.

## హాయ్ నాన్న.. ఓ టెన్షన్ తీరినట్లే




నేచురల్ స్టార్ నాని హీరోగా శౌర్యువ్ దర్శకత్వంలో తెరకెక్కిన హాయ్ నాన్న మూవీ డిసెంబర్ 7న థియేటర్స్ లోకి రాబోతోంది. పాన్ ఇండియా లెవల్ లో ఐదు భాషలలో ఈ సినిమాని రిలీజ్ చేయబోతున్నారు. ఇప్పటికే ఈ సినిమా ప్రమోషన్స్ లో నాని బిజీగా పాల్గొంటున్నాడు. తాజాగా ప్రీరిలీజ్ ఈవెంట్ కూడా జరిగింది. ఇదిలా ఉంటే ఫ్యామిలీ ఆడియన్స్ టార్గెట్ గా హాయ్ నాన్న సినిమాని నాని తీసుకొస్తున్నాడు.

దసరా లాంటి బ్లాక్ బస్టర్ తర్వాత కంప్లీట్ జోనర్ చేంజ్ చేసి తండ్రి కూతుళ్ళ ఎమోషన్స్ తో హాయ్ నాన్న సినిమాని చేశారు. ఈ సినిమాపై నాని చాలా కాన్ఫిడెంట్ గా ఉన్నాడు. అయితే తాజాగా యానిమల్ మూవీ ప్రేక్షకుల ముందుకి వచ్చింది. హై ఎక్స్ పెక్టేషన్స్ తో ఈ సినిమా రిలీజ్ అయ్యింది. దానికి తగ్గట్లుగానే పాజిటివ్ టాక్ సొంతం చేసుకుంది. యానిమల్ సినిమా ఎఫెక్ట్ హాయ్ నాన్న మీద ఉంటుందనే అభిప్రాయం సినీ విశ్లేషకుల నుంచి వినిపించింది. యానిమల్ లో తండ్రి కొడుకుల ఎమోషనల్ డ్రామా కనెక్ట్ అయితే ఫ్యామిలీ ఆడియన్స్ కూడా థియేటర్స్ కి వెళ్లి మూవీ చూడటానికి ఆసక్తి చూపిస్తారని భావించారు. ఫ్యామిలీ ఆడియన్స్ ఎక్కువగా సెకండ్ వీక్ లో మూవీ చూడటానికి ఇంట్రెస్ట్ చూపిస్తారు. ఈ నేపథ్యంలో హాయ్ నాన్న సినిమాపై యానిమల్ ప్రభావం ఎంతో కొంత ఉంటుందని భావించారు. మూవీ రిలీజ్ తర్వాత ఎక్స్ పెక్ట్ చేసిన విధంగానే యానిమల్ పాజిటివ్ టాక్ సొంతం చేసుకుంది. అలాగే సినిమాలో భారీ వయోలెంట్ సీన్స్ ఫ్యామిలీ ఆడియన్స్ ని థియేటర్స్ కి రాకుండా ఆపేసే రేంజ్ లో ఉన్నాయని సినీ విశ్లేషకులు అంటున్నారు. కొన్ని సంభాషణలు, అలాగే సన్నివేశాలు కూడా ఫ్యామిలీ ఆడియన్స్ అస్సలు చూడలేరనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. ఈ కారణంగా యానిమల్ ఇంపాక్ట్ హాయ్ నాన్న సినిమాపై ఉండకపోవచ్చు అనే మాట వినిపిస్తోంది. యానిమల్ సూపర్ హిట్ అయిన డీసెంట్ ఫ్యామిలీ కథలు కోరుకునే ఆడియన్స్ హాయ్ నాన్న సినిమాకి ప్రాధాన్యత ఇస్తారనే అంచనా వేస్తున్నారు. చూడాలి మరి బాక్సాఫీస్ వద్ద ఎలాంటి కలెక్షన్స్ వస్తాయో.

## బ్యాక్ అందాలు చూపిస్తూ కవ్విస్తోంది

పంజాబీ, మలయాళం సినిమాలతో పాటు హిందీలో కూడా పలు సినిమాల్లో నటించి మెప్పించిన ముద్దుగుమ్మ వామికా గబ్బి. ఈ అమ్మడు 2015 నుండి ఇండస్ట్రీలో కొనసాగుతోంది. తెలుగు లో ఈ అమ్మడు భలే మంచి రోజు అనే సినిమాలో నటించడం ద్వారా టాలీవుడ్ ప్రేక్షకులకు పరిచయం అయిన విషయం తెల్సిందే. హీరోయిన్ గా తెలుగు లో ఈమె సుధీర్ బాబుకు జోడీగా నటించి మెప్పించింది. అయితే ఆ తర్వాత పెద్దగా ఆఫర్లు దక్కించుకోలేక పోయింది. అయితే సోషల్ మీడియాలో ఎప్పటికప్పుడు ఈ అమ్మడు అందాల ఆరబోత



చేస్తూ కవ్విస్తూనే ఉంది. తాజాగా మరోసారి ఈ అమ్మడి అందాల ఆరబోతతో కన్నుల విందు చేసింది. తాజాగా వామికా గబ్బి బ్యాక్ లెస్ డ్రెస్ తో వావ్ అనిపించింది. వీపు అందాన్ని చూపిస్తూ పిచ్చెక్కిస్తున్న ఈ అమ్మడి అందాల ఆరబోతకు ప్రతి ఒక్కరు కూడా ఫిదా అవుతున్నారు. ఆకట్టుకునే అందంతో పాటు మంచి ఫిజిక్ ఈమె సొంతం అన్నట్లుగా కామెంట్స్ వస్తున్నాయి. ఈ రేంజ్ లో అందాల ప్రదర్శన చేస్తున్నా కూడా పాపం ఎందుకు ఈమెను ఇండస్ట్రీ వర్గాల వారు పట్టించుకోవడం లేదు కొందరు అసహనం వ్యక్తం చేస్తున్నారు. బ్యాక్ అందాలతోనే కాకుండా ఎప్పుడు కూడా ఈ అమ్మడు తన క్లీవేజ్ షో తో కూడా ఆకట్టుకుంటూ ఉంది

## ట్రాన్సపరెంట్ చీరలో బ్రో బ్యూటీ సెగలు..!

ఒకే ఒక్క వీడియోతో నేషనల్ క్రష్ గా మారిన బ్యూటీ ప్రియా ప్రకాశ్ వారియర్. జస్ట్ ఒక్క కన్ను కొట్టి, కుర్రాళ్ల మనసు దోచేసింది. ఆ తర్వాత వెంటనే ఈ బ్యూటీకి ఆఫర్లు క్యూ కట్టాయి. కానీ, ఏవీ పెద్దగా క్లిక్ కాకపోవడంతో, క్రేజ్ కేవలం సోషల్ మీడియాకే పరిమితమైంది. అయితే తాను చేసిన తప్పులను తెలుసుకున్న ప్రియా వారియర్, ఇప్పటి నుంచి కథల ఎంపిక విషయంలో జాగ్రత్తలు తీసుకోవడం మొదలుపెట్టింది. ఈ క్రమంలోనే ఇటీవల పవన్ కళ్యాణ్ బ్రో మూవీలో ఛాన్స్ కొట్టేసింది. ఈ మూవీలో ప్రియా వారియర్ పాత్ర నిడివి తక్కువ అయినప్పటికీ, నటనకు మంచి మార్కులేపడ్డాయి. ఇక మూవీ కూడా విజయం సాధించడంతో, ఆమెకు ఆఫర్లు పెరిగే అవకాశం ఉందని ఫ్యాన్స్ భావిస్తున్నారు. సినిమాల మాట ఎటు ఉ



న్నా, సోషల్ మీడియాలో మాత్రం ఎప్పటికప్పుడు సందడి చేస్తూ ఉంటుంది. తాజాగా తెలుపు రంగు చీరలో చందమామలా మెరిసిపోయింది. టాన్సాపరెంట్ తెలుగు రంగు చీరకి, మ్యాచింగ్ బ్లౌజ్ ధరించింది. ఆ డిజైనర్ బ్లౌజ్ లో తన ఎద అందాలు స్పష్టంగా కనిపించేలా ఫోటోలకు ఫోజులు ఇచ్చింది. ఇప్పుడు ఈ అందాలకు అందరూ ఫిదా అయిపోతున్నారు. ఏమి ఆ అందం బ్రో అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఇప్పుడంటే చీరలో అందాలు ఆరబోసింది కానీ, మామూలుగా అయితే ఎక్కువగా ట్రెండీ దుస్తుల్లోనే మెరుస్తూ ఉంటుంది. ఇటీవల బీచ్ లో బికినీ వేసుకొని తన స్నేహితులతో కలిసి ఫుల్ రచ్చ చేసింది. ఆ ఫోటోలు కూడా తెగ వైరల్ అయ్యాయి. ఇక ప్రియా వారియర్ బ్రో కంటే ముందు తెలుగులో రెండు చిత్రాల్లో నటించింది. ముందు నితిన్ సరసన 'చెక్' చిత్రంలో నటించింది. ఆ తర్వాత యంగ్ హీరో తేజ సజ్జ సరసన 'ఇష్క్ : నాట్ ఏ లవ్ స్టోరీ'లో నటించింది. అయితే ఈ రెండు చిత్రాలు ప్రియాకు సక్సెస్ ను అందించలేకపోయాయి. కాగా, తెలుగు, తమిళంలోనూ నటించింది.




# మా అభ్యర్థుల ట్రాపింగ్‌కు కేసీఆర్ ప్రయత్నం!

బెంగళూరు: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ సునాయాసంగా అధికారంలోకి వస్తోందని కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ఎన్నికల ఫలితాలపై ఆయన బెంగళూరులో మీడియాతో మాట్లాడారు.

"కాంగ్రెస్ అభ్యర్థులను ట్రాప్ చేసేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రయత్నిస్తున్నారు. ఆయన స్వయంగా సంప్రదించినట్లు మా పార్టీ అభ్యర్థులు చెప్పారు. గెలిచిన వారిని క్యాంపులకు తరలించే అవసరం రాదు" అని డీకే తెలిపారు. మరోవైపు 119 అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు కోసం 49 కేంద్రాలను కేంద్ర ఎన్నికల సంఘం ఎంపిక చేసింది. 113 నియోజకవర్గాలకు సంబంధించి ఓట్ల లెక్కింపు 14 టేబుళ్ల ద్వారా జరుగనుంది.

500లకు పైగా పోలింగ్ కేంద్రాలున్న 6 నియోజకవర్గాల్లో 28 టేబుళ్లను ఏర్పాటు చేయనున్నారు. ఆదివారం ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం అవుతుంది.



# రిజల్ట్ వేళ.. బీఆర్ఎస్ సర్కార్‌పై ఈసీకి ఫిర్యాదు

## భూరికార్డులు మారుస్తున్నారు.. వేల కోట్లు కాంట్రాక్టర్ల ఖాతాలోకి: కాంగ్రెస్ నేతలు

హైదరాబాద్: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు.. రాష్ట్ర ప్రభుత్వ అధికారాలు దుర్వినియోగం కాకుండా చూడాలని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధాన అధికారి వికాస్ రాజ్‌ను కాంగ్రెస్ నేతలు కోరారు. శనివారం ఉదయం ఈసీ కార్యాలయానికి వెళ్లిన నాలుగు అంశాల విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఫిర్యాదు చేసింది. తెలంగాణ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్(సీఈవో)ను కలిసిన అనంతరం బయటకు వచ్చిన కాంగ్రెస్ నేతల తరపున ఉత్తమ్ కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. "బీఆర్ఎస్ నేతలకు సంబంధించిన కాంట్రాక్టర్లకు నిధులు మంజూరు చేయిస్తున్నారు. రూ.6 వేల కోట్లను తమకు నచ్చిన కాంట్రాక్టర్లకు ఇచ్చేందుకు బీఆర్ఎస్ సర్కార్ ప్రయత్నిస్తోంది. బీఆర్ఎస్ ప్రభుత్వం నిబంధనలు పాటించడం లేదు. రైతు బంధు నిధుల్ని కాంట్రాక్టర్ల బిల్లులకు మళ్లిస్తున్నారు. భూరికార్డులు మారుస్తున్నట్లు కూడా మాకు సమాచారం ఉంది. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని భూముల్ని ధరణి పోర్టల్‌లోకి మారుస్తున్నారు.... ఈ విషయాలన్నీ సీఈవో దృష్టికి తీసుకెళ్లాం. అసైన్డ్ భూముల రికార్డులు మార్చకుండా చూడాలని కోరాం. ప్రభుత్వ లావాదేవీలపై విజిలెన్స్ నిఘా పెట్టాలని కోరాం. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పుడు.. రాష్ట్ర ప్రభుత్వ అధికారాలు దుర్వినియోగం కాకుండా చూడాలని కోరాం" అని ఉత్తమ్ వివరించారు. డిసెంబర్ 4వ తేదీన జరగబోయే కేబినెట్ భేటీలో కేసీఆర్ సర్కార్ ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా నిలువరించాలని కాంగ్రెస్ నేతలు ఈసీని కోరినట్లు తెలుస్తోంది. ఈసీని కలిసిన బృందంలో.. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మధుయాష్కీ గౌడ్ తదితరులు ఉన్నారు.

# కేసీఆర్ గజ్వేల్‌లో హ్యాట్రిక్ కొడతారా?

## కేసీఆర్ గజ్వేల్‌లో హ్యాట్రిక్ కొడతాడు!.. నా పందెం ఇంత
## లే.. గజ్వేల్‌లో ఈటలనే గెలుస్తాడు! అంతకంటే డబుల్ నా పందెం
## హరీష్‌రావు లాస్ట్ ఎలక్షన్‌ల వచ్చిన మెజారిటీ ఈసారి క్రాస్ చేస్తాడని నా బెట్ - దాటడని నా బెట్
## ఖమ్మంలో పువ్వాడ-తుమ్మల పోటీలో గెలుపు ఆయనదే..
## బర్రెలక్క ఈ ఎలక్షన్స్‌లో కచ్చితంగా గెలుస్తుందని ఇంత సొమ్ము వేస్తున్నా..



మరికొన్ని గంటల్లో తెలంగాణ అసెంబ్లీ ఫలితాలు వెల్లడి కానున్నాయి. ఎవరు గెలుస్తారనే ఉత్కంఠ అంతటా నెలకొంది. ఈ సమయంలోనే పందెం రాయుళ్ల జోరు పెంచారు. గత నెల రోజుల నుంచి ఎలక్షన్ బెట్టింగ్ ఈ తంతు నడుస్తున్నప్పటికీ.. ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలు, కౌంటింగ్‌కు సమయం దగ్గరపడడంతో ఇప్పుడు పందెం కాసే సొమ్ము అమాంతం పెరిగిపోయినట్లు తెలుస్తోంది. ప్రధానంగా పెద్ద లీడర్ సాబ్‌ల మీద, తెలంగాణలో ఏ పార్టీ ప్రభుత్వంలోకి వస్తుందన్న దానిపై బెట్టింగ్ నడుస్తున్నట్లు సమాచారం.

**కాయ్ రాజా కాయ్..** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై తెలుగు రాష్ట్రాల్లో ఉత్కంఠ నెలకొంది. నేతల మీద జోరుగా బెట్టింగ్ నడుస్తోంది. మొత్తం 33 జిల్లాల్లో.. ఎంపిక చేసిన నేతలపైనే పందేలు వేస్తున్నారు. బెట్టింగ్స్ కోసమే సర్వేలు చేయించుకున్న కొందరు.. లక్షల నుంచి కోట్లలో కాస్తున్నారు. ముఖ్య నేతల మీద, మంత్రుల గెలుపోటముల మీద ఓ లెక్క లేకుండా వేస్తున్నారు. హైదరాబాద్, తెలంగాణలో బెట్టింగ్ నిర్వహిస్తే పట్టుబడే అవకాశం ఉందని గుర్తించిన బుకీలు.. ఇతర ప్రాంతాల నుంచి దందా సాగిస్తున్నారు. హైదరాబాద్ సెటిలర్స్ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో, ఏపీకి సమీపంలో ఉన్న ప్రాంతాలపై బెట్టింగ్స్ నడుస్తున్నట్లు తెలుస్తోంది.

**షాకింగ్ బెట్. ఇంట్రెస్టింగ్ రేటు :** దుబ్బాకలో రఘునందన్‌రావు గెలుస్తాడా? ఓడిపోతాడా?.. సంగారెడ్డిలో రఘునందన్‌రావు మళ్లీ నెగ్గుతాడా?ఇలా.. ఆప్షన్‌లతో బెట్టింగులు నడుస్తున్నాయి. కామారెడ్డి, గజ్వేల్ మీద బెట్టింగ్ ముఠాల స్పెషల్ ఫోకస్ ఉంది. ఈ రెండు సెగ్మెంట్‌లలో కేసీఆర్ పోటీ చేస్తుండడమే ప్రధాన కారణమని చెపనక్కర్లేదు. కేసీఆర్ హ్యాట్రిక్ విజయం సాధిస్తారు అనేదానికంటే.. గజ్వేల్‌లో ఈటల నెగ్గుతారనే ఇంకా ఎక్కువ సొమ్ముతో పందెం వేస్తున్నారు. అంతెందుకు విదేశాల నుంచి కూడా యాప్స్ బెట్టింగ్ వ్యవహారం నడుస్తోందని టాక్. సిద్ధిపేట నియోజకవర్గంలో హరీష్‌రావు గత ఎన్నికల్లో 1 లక్షా 19 వేల మెజారిటీ సాధించారు. ఈసారి ఆ మెజారిటీ రికార్డును దాటేస్తారా? అని పందెం వేస్తున్నారు. పలువురు తెలంగాణ మంత్రులు పోటీ చేస్తున్న స్థానాలపై ఎక్కువ ఫోకస్ పెడుతున్నారు పందెం రాయుళ్లు. ఖమ్మంలో తుమ్మల-పువ్వాడ ఫైట్ మీద, పాలకుర్తిలో ఎర్రబెల్లి ఓడిపోతారని, కేటీఆర్ మెజార్టీ ఎలా ఉండబోతుందని, ఆదిలాబాద్-కరీంనగర్‌లో బీఆర్ఎస్‌కు జీరో సీట్లు అని.. ఇలా రకరకాల ఆప్షన్‌లతో పందెలు వేస్తున్నట్లు తెలుస్తోంది.

**పైసలే కాదు..** పొలిటికల్ బెట్టింగ్‌లో.. డబ్బులే కాదు భూములను కూడా పందెంలో పెడుతున్నారు కొందరు. సిర్పూర్ నియోజకవర్గం పరిధిలో గెలుపోటములపై లక్షల్లో సొమ్ముతో పాటు పొలాలను కూడా కొందరు తాకట్టు పెడుతున్నట్లు సమాచారం. మొత్తంగా తెలంగాణ ఎన్నికల ఫలితాల బెట్టింగ్ విలువ రూ.10 వేల కోట్ల రూపాయల దాకా ఉండొచ్చనేది ఒక అంచనా.

# అప్రమత్తమైన కాంగ్రెస్ అధిష్ఠానం.. అభ్యర్థులను హైదరాబాద్‌కు తరలించే యోచన



హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ దృష్ట్యా రాష్ట్రంలో రాజకీయం హీటెక్కింది. ఓవైపు ఎన్నికల్లో పూర్తిస్థాయి మెజారిటీ వస్తుందని రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నప్పటికీ.. అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని పార్టీ అధిష్ఠానం రాష్ట్ర నేతలకు సూచించినట్లు తెలుస్తోంది. కౌంటింగ్‌కు ముందు అభ్యర్థులు ఎవరూ చేజారకూడదని, ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఉండేందుకు అధిష్ఠానం చర్యలకు ఉపక్రమించింది. పార్టీ అభ్యర్థులందరినీ హైదరాబాద్ రప్పించాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. నగరంలోని హోటల్ తాజ్ కృష్ణలో అభ్యర్థులకు ఏఐసీసీ ప్రతినిధులు దిశానిర్దేశం చేయనున్నట్లు సమాచారం.

మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా ఓట్ల లెక్కింపు జరగనున్న 49 కౌంటింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక పరిశీలకులను ఏఐసీసీ నియమించింది. ఎన్నికల ఏజెంట్‌కు ఎమ్మెల్యే ధ్రువపత్రం ఇవ్వాలని తెలంగాణ కాంగ్రెస్ నేతలు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్‌ను కలిసి కోరారు. అయితే అలాంటి వెసులుబాటు ఏదీ లేదని వికాస్ రాజ్ వారికి స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.

# ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ విడుదలకు ఈసీ అనుమతి

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ విడుదలకు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) అనుమతి ఇచ్చింది. ఉద్యోగులకు మూడు డీఏలు పెండింగ్‌లో ఉండగా.. ఒక డీఏ విడుదలకు అనుమతి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం ఈసీని విజ్ఞప్తి చేసింది. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం, ఈసీ మధ్య సంప్రదింపులు జరిగాయి. డీఏల చెల్లింపు ఎందుకు ఆలస్యం అయిందని.. ఇప్పుడే ఎందుకు ఇస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఈసీ అడిగింది. గతంలో డీఏల చెల్లింపు విధానాలపైనా ఈసీ ఆరా తీసింది. డీఏ విడుదలకు అనుమతి ఇవ్వాలని ఉద్యోగ సంఘాలు కూడా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ద్వారా ఈసీకి తమ వినతిని పంపాయి. తాజాగా పోలింగ్ ముగిసిన నేపథ్యంలో ఉద్యోగులకు డీఏ విడుదలకు ఈసీ అనుమతి ఇచ్చింది. ఒక డీఏ విడుదలకు ఎలాంటి అభ్యంతరం లేదని పేర్కొంది.




# ఓటమి బాటలో బీయారెస్ మంత్రులు...?





హైదరాబాద్: : తెలంగాణా ఎన్నికల ఫలితాలు రావడానికి కౌంట్ డౌన్ స్టార్ట్ అయింది. ఒక్క రోజు ఆగితే హాట్ హాట్ సండే గా తెలంగాణా ఎన్నికల ఫలితాలు ఆదివారం వస్తాయి. దాంతో తెలంగాణా రాజకీయం అంతా వేడిగా ఉంది. పోలింగ్ జరిగింది, ఎగ్జిట్ పోల్ సర్వేలు వచ్చాయి. కాంగ్రెస్ గెలుస్తుంది అని అనేక సర్వేలు చెబుతున్నాయి. దాదాపుగా ఇరవై దాకా ఎగ్జిట్ పోల్స్ వస్తే అందులో పదిహేడు దాకా కాంగ్రెస్ కే పట్టం కట్టాయి. ఇక రెండు సర్వేలు బీయారెస్ కి అధికారం ఇస్తే ఒకటి రెండు సర్వేలు హంగ్ వైపుగా చూపించాయి. ఈ పరిణామాలు ఇలా ఉంటే తెలంగాణాలో సైలెంట్ వేవ్ నడచిందా అన్న చర్చ సాగుతోంది. సైలెంట్ వేవ్ అయితే మహామహులే కొట్టుకుపోతారని గత రాజకీయ చరిత్ర రుజువు చేస్తోంది. దాంతో తెలంగాణాలో ఓడిపోయే వారు ఎవరు అన్న దాని మీద ఎవరికి తోచిన తీరున వారు విశ్లేషించుకుంటున్నారు. కేసీయార్ క్యాబినేట్ లో ఎంత మంది మంత్రులు తిరిగి గెలుస్తారు అన్నది కూడా అతి పెద్ద ప్రశ్నగా ఉంది. మొత్తం మంత్రులు కేసీయార్ కాకుండా పదిహేడు మంది దాకా ఉన్నారు. అయితే ఇందులో గట్టిగా తిరిగి గెలిచేది ముగ్గురు నలుగురు తప్ప ఎవరూ కారని అంటున్నారు. ఇక ఆ గెలిచే వారిలో మంత్రి హరీష్ రావు, కేటీయార్ ఉంటారని అంటున్నారు. ఇక్కడ కూడా హరీష్ రావు సిద్ధిపేటలో ఎలాంటి ఆయాసం లేకుండా కంఫర్ట్ జోన్ లోనే గెలుస్తారని అంటున్నారు. కేటీయార్ మాత్రం అతి కష్టం మీద గెలుస్తారు అని అంటున్నారు. ఇక గెలిచే ఆ మూడవ మంత్రి ఎవరు అన్నది చూడాలని అంటున్నారు. ఓడే మంత్రుల లిస్ట్ చూస్తే చాలానే ఉంది అంటున్నారు. గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకరరావు, సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్వరరెడ్డి, ప్రశాంత్ కొప్పుల ఈశ్వర్, ఇంద్రకరణ్ రెడ్డి, శ్రీనివాసగౌడ్, నిరంజన్ రెడ్డి, మల్లారెడ్డికి ఓటమి తప్పదనే సంకేతాలు ఉన్నాయని అంటున్నారు. ఇక ఓడిపోతామన్న సంగతి మంత్రులకు కూడా తెలుసు అని అంటున్నారు. చాలా మంది మంత్రులు ప్రచారానికి వెళ్తే ప్రజల నుంచి తిరస్కారాలు ఎదురయ్యాయని కొన్ని చోట్ల మా వైపు రావద్దు అని ముందే చెప్పేసారు అని అంటున్నారు. దాంతో అనవసరంగా డబ్బులు ఖర్చు చేయడం దండుగ అనే కొంతమంది ముందు జాగ్రత్త చర్యలు చేపట్టి పొదుపుగానే తిరిగి పొదుపుగానే ఖర్చు చేశారు అని కూడా అంటున్నారు. సరిగ్గా పోలింగ్ కి మూడు రోజుల ముందే కొంత మంది మంత్రులు ట్రెండ్ ని చూసి ప్రచార పటాటోపాలను తగ్గించుకున్నారు అని అంటున్నారు. ఇక మరికొంతమంది మంత్రులు మాత్రం ప్రచారం గట్టిగా చేసినా లోపల ఓటమి భయం పీకుతోందని అని అంటున్నారు. ఏది ఏమైనా మెజారిటీ మంత్రులు ఓటమి బాట పడతారు అని అంటున్నారు. సైలెంట్ వేవ్ బలంగా వీస్తే మంత్రులతో పాటు బీయారెస్ అగ్ర నాయకత్వంలోని త్రయానికి కూడా ముప్పు ముంచుకు వచ్చే అవకాశం ఉంది అని అంటున్నారు. ఏది ఏమైనా ఓటమి అన్న ఆలోచన ఇపుడు మంత్రులను వెంటాడుతోంది అని అంటున్నారు. డిసెంబర్ 3వ తేదీ వరకూ ఈ రకమైన టెన్షన్ తప్పదని అంటున్నారు. అసలు ఫలితాలు ఏ రకమైన సందేశాలను ఇస్తాయో చూడాల్సి ఉంది.

# కేసీఆర్‌కు వైఎస్ షర్మిల వెరైటీ గిఫ్ట్.. బైబై కేసీఆర్ అంటూ..




హైదరాబాద్: తెలంగాణలో రేపు ఎన్నికల ఫలితాలు వెల్లడికానున్నాయి. గెలుపు తమదే అంటే తమదే అంటూ అన్ని పార్టీలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. ఈ క్రమంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు వైఎస్సార్టీపీ అధినేత్రి వైఎస్ షర్మిలారెడ్డి వెరైటీ గిఫ్ట్ పంపించారు. బైబై కేసీఆర్ అంటూ కేసీఆర్‌కు సూట్ కేసును గిఫ్ట్‌గా పంపించారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ.. "బైబై కేసీఆర్..కేసీఆర్ సూట్ కేసు పట్టుకుని సర్దుకునే టైం వచ్చింది. కేసీఆర్ గారు ప్యాక్ అప్ చేసుకోండి. బైబై కేసీఆర్" అంటూ వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ పాలనకు ఎండ్ కాడ్ పడబోతుందన్నారు. కేసీఆర్ ప్యాక్ అప్ చేసుకునే టైం వచ్చిందని... ఆయనకు ఒక గిఫ్ట్ ఇస్తున్నామని అన్నారు. కర్నాటక ఎన్నికల్లో 71 మంది పదివేల మెజార్టీతో గెలిచారు. పదివేల మెజార్టీ అయినా కూడా ముఖ్యం కాబట్టి.. తాము పోటీ చేసి ఒకవేల 5,000 ఓట్లు చీల్చినా తేడా వస్తుందని.. కేసీఆర్‌ను ఓడించాలని కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చామని అన్నారు. ఇన్నాళ్లు బీజేపీ, బీఆర్ఎస్ కలిసే ఉన్నారని తెలంగాణ ప్రజలకు అర్థం అయ్యిందన్నారు. కేసీఆర్ అవినీతి మీద బీజేపీ ఒక్క యాక్షన్ కూడా తీసుకోలేదని విమర్శించారు. వీళ్లిద్దరు తోడుదొంగలు అయి కలిసే ఉన్నారని ఆరోపించారు. "కేసీఆర్‌కు మించిన కరెప్ట్ పొలిటీషియన్ లేరని అమిత్ షా చెప్పారు. ఆయన ఏ స్కీం లు చేసినా అవినీతే అని మోదీ చెప్పారు... మీరు మీరు కలిసి లేకపోతే మేం ఎంక్వైరీ వేయాలని కోరినా ఒక్క యాక్షన్ కూడా ఎందుకు తీసుకోలేదు" అని ప్రశ్నించారు. బీఆర్ఎస్, బీజేపీ రెండు పార్టీలు ఒకటి కాకపోతే ఈ ఎన్నికల్లో మద్దతు ఇవ్వకుండా ఉండాలన్నారు. దీన్ని రిఫరాండంగా తీసుకోవాలి తప్ప ఎమ్మెల్యేలను కొనుగోలు చేయొద్దని అన్నారు. 2014, 2018లో 45 మందిని కేసీఆర్ కొన్నారని.. కేసీఆర్ కొన్న ఎమ్మెల్యేలు 40, ఎమ్మెల్సీ 4, ఎంపీ 1 రిని కొన్నారని తెలిపారు. ఇది మళ్లీ రిపీట్ కాకూడదని.. బ్యాక్ డోర్ పాలిటిక్స్ చేసి అధికారంలోకి వచ్చే విధంగా చేయకూడదని కేసీఆర్‌ను తాము డిమాండ్ చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీలో క్రెడిబిలిటీ ఉన్న వాళ్లు చాలా మంది ఉన్నారని చెప్పారు. ప్రభుత్వం మారాలని.. ఎవరు ముఖ్యమంత్రికావాలన్నది కాంగ్రెస్ పార్టీ నిర్ణయిస్తుందని వైఎస్ షర్మిలారెడ్డి చెప్పుకొచ్చారు.

# మందు బాబులకు బ్యాడ్ న్యూస్.. ఆదివారం వైన్ షాపులు బంద్




హైదరాబాద్: తెలంగాణ ఎన్నికల ఫలితాలకు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. మరికొన్ని గంటల్లో అభ్యర్థుల భవితవ్యం తేలిపోనుంది. 119 నియోజకవర్గాల్లో ఓటర్ల తీర్పు ఈవీఎంలలో నిక్షిప్తమై ఉంది. ఈసారి బీఆర్ఎస్ హ్యాట్రిక్ కొడుతుందా? లేదంటే చెయ్యి పార్టీ అధికారాన్ని హస్తం గతం చేసుకుంటుందో తేలిపోనుంది. ఫలితాలపై నేతల్లో.. ప్రజల్లో నరాలు తెగే ఉత్కంఠ సాగుతోంది. ఇంకోవైపు బెట్టింగ్‌లు కూడా పెద్ద ఎత్తున నడుస్తున్నాయి.

ఇక ఆదివారం ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా రాష్ట్రం వ్యాప్తంగా మందు షాపులు మూసివేయాలని పోలీస్ శాఖ ఆదేశించింది. ఈ మేరకు వైన్ షాపు యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. అలాగే భాగ్యనగరంలో వైన్ షాపులు మూసివేయాలని హైదరాబాద్ పోలీస్ కమీషనర్ సందీప్ శాండిల్యా ఆదేశాలు జారీ చేశారు. కౌంటింగ్ కేంద్రాల దగ్గర పటిష్టమైన భద్రతా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ర్యాలీల్లో ఉద్రిక్తతలు చోటుచేసుకుండా చర్యలు చేపట్టారు.

# కుట్రలతో నన్ను చాలా ఇబ్బంది పెట్టారు: సీతక్క ఆవేదన



ములుగు: రేపు తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఓట్ల కౌంటింగ్ జరుగనుంది. మరోవైపు.. అసెంబ్లీ ఎన్నికలపై ఇప్పటిక ఎగ్జిట్‌పోల్స్ ఆసక్తికర వివరాలను వెల్లడించాయి. దీంతో, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీనే అధికారంలోకి వచ్చే అవకాశం ఉన్నట్టు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇలాంటి తరుణంలో కాంగ్రెస్ నేత, ములుగు ఎమ్మెల్యే సీతక్క కీలక వ్యాఖ్యలు చేశారు. కాగా, సీతక్క శనివారం మీడియాతో మాట్లాడుతూ.. వచ్చేది ఇందిరమ్మ రాజ్యమే. ప్రతి ఇంటా వెలుగులే. బీఆర్ఎస్ నాయకులు వ్యక్తిగత విమర్శలు, కుట్ర రాజకీయాలతో చాలా ఇబ్బంది పెట్టారు. నన్ను ఆడబిడ్డగా ములుగు ప్రజలు ఆదిరించారు. చిన్న పిల్లలు కూడా నాకే మద్దతు ఇచ్చి అక్కున చేర్చుకున్నారు. నా జీవితానికి ఇంకేం కావాలి. నా గెలుపుకోసం కష్టపడ్డ అందరికీ ధన్యవాదాలు. నేనెప్పుడూ మీ సేవకురాలినే. నేను ములుగు ప్రజల వెంటే ఉంటాను. కాంగ్రెస్ ప్రభుత్వంలో సంక్షేమంతో అభివృద్ధి చేస్తాను. నన్ను రీల్ అన్నారు. నేను కష్టకాలంలో ప్రజల వెంటే ఉన్నాను. వారికి ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పారు. వారికి ఆడబిడ్డ ఉసురు తగులుతుంది. నన్ను అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేశారు. నా కార్యకర్తలను డబ్బులతో కొనుగోలు చేసి తప్పుడు ప్రకటనలు ఇప్పించారు. ఏ కష్టం వచ్చినా జనం వెంటే ఉంటాను. పార్లమెంట్ ఎన్నికల్లో రాహూల్ ప్రధాని అయ్యేలా కృషి చేస్తాను. ఎన్నికల్లో కష్టపడ్డ అందరికీ కృతజ్ఞతలు అంటూ కామెంట్స్ చేశారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com